https://epaper.dksaardyamlochaatimpu.com
E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737





డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 295 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం, ఆగస్టు,25, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

# మణిపూర్‌లో కాల్పులు..

## పారామిలిటరీ జవాన్‌కు గాయం, పలు ఇళ్లకు నిప్పు

ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దుండగులు పలు ఇళ్లకు నిప్పుపెట్టారు. భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకోగా కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక జవాన్ కాలుకు గాయమైంది. కాంగ్‌పోక్పి జిల్లాలోని సేనాపతి, పరిసర ప్రాంతాల్లో ఈ సంఘటనలు జరిగాయి. సోమవారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో నాగా తెగలకు చెందినవారి ఇళ్లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. తఫౌ కుకి, ఫూబా గ్రామాల్లో నాగా నివాసితుల ఇళ్లకు నిప్పుపెట్టారు. లై గ్రామానికి చెందిన నాగా నివాసి ఇంటిని కూల్చివేశారు. 9ఎంఆర్, మారెయిమెయి పరిసరాల్లో కూడా నాగా తెగలకు చెందిన ఇళ్లపై దాడులు జరిగాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బందితో పాటు పారామిలిటరీ దళాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నాయి. అయితే లియాంగ్‌మై తఫౌ వద్ద ఊహించని విధంగా కాల్పులు జరిగాయి. 36 సీఆర్‌పీఎఫ్‌కు చెందిన జవాన్



కాలికి బుల్లెట్ గాయమైంది. సేనాపతిలోని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువైపుల నుంచి కాల్పులు జరిగినట్లు కనిపించిందని, అయితే బుల్లెట్ ఏ దిశ నుంచి వచ్చిందో తాను గుర్తించలేకపోయానని గాయపడిన ఆ జవాన్ తెలిపారు.

# రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జైశంకర్ భేటీ..

**న్యూఢిల్లీ,ఆగస్టు 24:** భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. నిన్నటి నుంచి రష్యాలో పర్యటిస్తున్నారు. ఇక పర్యటనలో భాగంగా సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జైశంకర్ సమావేశం అయ్యారు. భారత బృందాన్ని పుతిన్ ఆప్యాయంగా పలకరించారు. సుంకాల విషయంలో అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. వచ్చే నెలలో భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి రానున్నారు. ఈ నేపథ్యంలో జై శంకర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక రష్యాఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్ ఆహ్వానం మేరకు జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. మాస్కోతో వాణిజ్యం, ఇంధనం, రక్షణ, భౌగోళిక రాజకీయ అంశాలపై జైశంకర్ చర్చించనున్నారు. ఇక పుతిన్ భారత్‌కు వచ్చే ముందు జైశంకర్ రష్యాలో పర్యటించడం రెండు దేశాల సంబ



ంధాలపై ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యాతో ఇంధన, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడనున్నాయి

## నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను

# అవమానించడమే

### - విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం

### - నాది చాటుమాటు పర్యటన కాదు.. సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 24:** వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకం గా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు.

ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం.

అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది.



ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారు? గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ పోరుబాట..

## సీఎం రేవంత్‌పై బీజేపీ చీఫ్ ఫైర్

**హైదరాబాద్,ఆగస్టు 24:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. "మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి" అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా



విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ. 1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ. 1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ. 4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ. 12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు.

## కల్యాణలక్ష్మిపై హైకోర్టు కీలక ఆదేశాలు

# దివ్యాంగ వధువులకు ఊరట.. స్టే ఎత్తివేత

### - మిగతా లబ్ధిదారులకు కొనసాగిన స్టే- ప్రభుత్వానికి రెండు వారాల గడువు

పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించే 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాల అమలుపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ పథకాల నిధుల విడుదలపై ఇచ్చిన మధ్యంతర స్టేను సవరిస్తూ, దివ్యాంగ వధువులకు సంబంధించి ఊరటనిచ్చే నిర్ణయాన్ని వెల్లడించింది. దివ్యాంగ వధువులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అందించే ఆర్థిక సాయంపై గతంలో విధించిన స్టేను హైకోర్టు తొలగించింది. దీంతో దివ్యాంగ లబ్ధిదారులకు నిధుల విడుదల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. అయితే దివ్యాంగులు మినహా మిగిలిన సాధారణ వర్గాల లబ్ధిదారులకు సంబంధించి మాత్రం నిధుల విడుదలపై ఉన్న స్టే యథాతథంగా కొనసాగుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన చట్టబద్ధత, జీవోల అమలుపై తమ వాదనలు విన్పించేందుకు, పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్



సమర్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని సమయం కోరింది. దీనిపై స్పందించిన ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వ విన్నపాన్ని పరిశీలించి కౌంటర్ దాఖలుకు రెండు వారాల గడువు మంజూరు చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## కృష్ణా నీళ్లపై మళ్లీ పంచాయితీ..

# తాగునీటికే కృష్ణా జలాలు

### - 50:50 వాటాపై తెలంగాణ ప్రతిపాదన - పోతిరెడ్డిపాడుపై మళ్లీ వివాదం-47 టీఎంసీలపై ఏపీ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 24:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ముగిసింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి వాటాల వినియోగంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని కమిటీ నిర్ణయించింది.తాగునీటి పంపిణీపై తెలంగాణ ప్రతిపాదనలుసమావేశంలో తెలంగాణ ఈఎన్సీ రమేష్ బాబు మాట్లాడుతూ.. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటి పంపిణీని 50:50 రేషియో ప్రాతిపదికన చేపట్టాలని కమిటీ ముందు ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా చేపడుతున్న నీటి వాడకంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఏపీ ఇప్పటికే తమ వాటా కంటే అదనంగా 10 టీఎంసీల నీటిని వాడుకుందని, ఇకపై అక్కడ నుంచి నీటిని వాడబోమని ఏపీ అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి అవసరాల సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా చర్చించేందుకు సెప్టెంబర్ 4వ తేదీన మరొక ప్రత్యేక సమావేశాన్ని



ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ నరసింహ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల తాగునీటి ప్రాధాన్యతపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగిందన్నారు.




# సేవ్ ఎర్త్ ఫౌండేషన్ కు మదర్ ఇండియా జాతీయ అవార్డ్2026

## గౌరవ కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి చేతులు మీదుగా అవార్డును అందుకున్న సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్



హైదరాబాద్, ఆగస్టు24, డీకే చాటింపు:-జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ విభాగంలో విశేషంగా కృషి చేస్తున్న సేవ్ ఎర్త్ ఫౌండేషన్ కు స్వదేశీ సంస్థాన్ ఇండియా అయోధ్య యుపి. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ అవార్డులను అయోధ్యలోని సాగర్ కళా భవన్ వేదికగా ప్రదానం చేయడం జరిగింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సేవ్ ఎర్త్ ఫౌండేషన్ మదర్ ఇండియా 2026 కు ఎంపికయింది. అనివార్య కారణాలవల్ల అయోధ్యకి వెళ్లలేక పోయినా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ గౌరవ కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి చేతుల మీదుగా మదర్ ఇండియా అవార్డును స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ కు శాలువా తో సత్కరించి మెమొంటోని సర్టిఫికెట్ ని బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్యులు జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి మెరుగైన సేవలు అందించడం కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకుల యొక్క సేవలు అమూల్యమైనవి అన్నారు. సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ తన జీవిత లక్ష్యంగా స్వచ్ఛంద సేవలో నిమగ్నమై తెలంగాణకు కోటి మొక్కల మణిహారం లక్ష్యంగా ఐదు లక్షలకు పైగా మొక్కలు నాటడం, నాలుగు వేలకు పైగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ధార్మిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలోను పాల్గొంటూ ఇరవై ఐదు వేలకు పైగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేయడం వందలాది స్కూల్స్ లో పాఠశాల స్థాయి, మండల స్థాయి జిల్లా స్థాయిలలో భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించడం, వ్యక్తిత్వ వికాసం కోసం నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించడం ఆయా అంశాలపై చిత్రలేఖనం, వకృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తూ వారిని ప్రోత్సహించడం ప్రతిభకు గుర్తింపు నివ్వడం, నిరుపేద విద్యార్థుల కోసం దూర విద్యా విధానాల ద్వారా విద్యను అందించడం శీతాకాలంలో రోడ్డుపై నిద్రిస్తున్న అభాగ్యులకు బ్లాంకెట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం, వేసవిలో పశుపక్షాదులకు నీరు, ఆహారం పెట్టడం, తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షన్ రోడ్డు భద్రతా కార్యక్రమాలు, కరోనా, వరదలు, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నియంత్రణ, మత్తు వ్యసనాలపై అనేక అవగాహన కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తుండటం వల్ల స్వదేశీ సంస్థాన్ ఇండియా వారి సంస్థ సేవలను గుర్తిస్తూ స్వదేశీ భూషణ్ అదేవిధంగా మదర్ ఇండియా అవార్డును అందజేయడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. ఇలాంటి నిస్వార్థ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం ఆదర్శనీయం. గతంలో అంతర్జాతీయ, జాతీయ అవార్డులు విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్, ఇండియన్ ఐకాన్, పర్యావరణ మిత్ర, సేవారత్న, వనమాలి, నెల్సన్ మండేలా ఎక్సలెన్స్ వంటి అంతర్జాతీయ తదితర అవార్డులు పురస్కారాలను పొందడం వారి నిరంతర కృషి కి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన శ్రేయోభిలాషులు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కు కారణం తనను డైరక్ట్ చేస్తున్న సంస్థ ప్రతినిధులు, నాతో కలిసి క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వాలంటీర్స్ అన్నారు. జాతీయ స్థాయి గుర్తింపు ను పొందడం గర్వంగా ఉంది తమపై మరింత బాధ్యతను పెంచిందని అందరికీ హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతాభివందనాలు తెలిజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, గోషిక విఠలేశ్వర్ విజయ్ కుమార్ డాక్టర్ యాదగిరి, జి రాజేందర్ రెడ్డి, నీలం సురేష్ జయసూర్య, రామచంద్రవర్ధన్, శ్రీలతారాణి దైవం టీమ్ హరికృష్ణ, యజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





జగిత్యాల, ఆగస్టు24,(డీకే చాటింపు): ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారిశాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా ప్రజావాణికి సంబంధించి ప్రస్తుతం మొత్తం 182 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 93 దరఖాస్తులు 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా ప్రజావాణి నివేదికలో వెల్లడైంది.పెండింగ్ దరఖాస్తుల్లో జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద 28, జగిత్యాల మున్సిపాలిటీ వద్ద 23,జిల్లాహౌహౌఐ అండ్ సి ఏ డి వద్ద 17, ఏ డి ఎస్ ఎల్ ఆర్ వద్ద 15, మెట్‌పల్లి మున్సిపాలిటీ వద్ద 10, కోరుట్ల మున్సిపాలిటీ వద్ద 9, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 9,డీఆర్డిఏహౌహౌ9 దరఖాస్తులు ఉన్నాయి.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్. లత, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్,సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 103 ఫిర్యాదులు



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24 (డీకే చాటింపు): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తొలి తరం స్వతంత్ర యోధులు టంగుటూరి

## రవీంద్ర భారతి అసెంబ్లీ ముందు ఉన్న విగ్రహం దగ్గర పుష్పాంజలి



హైదరాబాద్, ( డీకే చాటింపు ) తొలి తరం స్వతంత్ర సమరయోధులు త్యాగధనులు దక్షిణ భారతదేశానికి తొలి చివరి ప్రధాని ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 155వ జయంతి వేడుకలు పుష్పాంజలి ప్రకాశం అభివృద్ధి మరియు అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం అసెంబ్లీ వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం చేసిన దేశ సేవ మరవ లేనిదని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులుకి భారతరత్న బిరుదు ప్రధానం చేయవలసిన అవసరం ఉందని దానికి కృషి చేస్తానని చెప్పారు సమస్త ప్రధాన సలహాదారు రుద్రరాజు పద్మరాజు మాట్లాడుతూ ప్రకాశం పంతులు తొలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అని ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు చాలా ఉన్నాయని కొనియాడుతూ వారి దూర దృష్టి వారి తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ బుద్ధి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు విలువలు కలిగిన రాజకీయ నేత అని దార్శనికుడు అని గ్రామ స్వరాజ్యానికి కృషి చేశారని ఆయనకు భారతరత్న ఇవ్వాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత శ్రీ రామదాసు టంగుటూరు రచించిన సురపరిచిన జయజయహో ఆంధ్ర కేసరి గీతం ఆవిష్కరించబడింది. ఇంకా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్వి సుబ్రహ్మణ్యం మాజీ చీఫ్ సెక్రటరీ, రుద్రరాజు పద్మరాజు సంస్థ ముఖ్యసలహాదారు మాజీ చీఫ్ విప్ స్వర్గీయ పీవీ నరసింహారావు కుమార్తె ఎమ్మెల్సీ శ్రీమతి వాణి సురభి ప్రకాశం మనవరాలు శ్రీమతి సరోజ ప్రముఖ సినీ దర్శకులు ఆదిత్య మాజీ న్యాయమూర్తి మాల్యాద్రి నివాళి అర్పించారు. అలాగే ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ సభ్యులు సర్వసరి డాక్టర్ పి మోహన్, వక్కలంక శ్రీనివాస్ రావు, నిరంజన్ దేశాయ్, హనుమంతరావు రాజశేఖర్ రామ్మోహన్ రెడ్డి రాధాకృష్ణ మంగపతి రావు వక్క లంక శ్రీనివాసరావు ఎన్ ఎస్ ఎన్ మూర్తి శివన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం




జగిత్యాల,ఆగస్టు24,(డీకే చాటింపు): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 17 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# నిండిన కౌలాస్ నాలా ప్రాజెక్టు ఒక గేటు ద్వారా నీటి విడుదల



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 24 (డీకే చాటింపు):జుక్కల్ నియోజకవర్గం లోని కౌలాస్ నాలా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో నిండు కుండల ఉంది. ఇదిలా ఉండగా ఒక గేటు ఎత్తి నీటిని వరదకాలువ ద్వారా వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం ఎత్తు 458 మీటర్ల కు గాను ప్రస్తుతం 457. 83 మీటర్ల నీటి నిలువ ఉందని ప్రాజెక్టు ఏఈ సుకుమార్ తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 890 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తుందని తెలిపారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 1.237 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.196 టీఎంసీల నీరు నిలువ ఉందని, వరద ఎక్కువగా ఉండడంతో 510 క్యూసెక్కులు నీటిని ఒక గేట్ ద్వారా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నీటిని దిగువకు వదులుతున్న దృష్ట్యా పరివాహక ప్రాంత ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టే వాళ్ళు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో విశేష పూజలు



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు24 ( డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లా సమీపాన జానకంపేటలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయము శ్రావణమాసంలో విశేష పూజలు అందుకుంటున్నారు ఈ దేవాలయము రాష్ట్ర కూటలు కాలంలో నిర్మించినది అతి పురాతనమైనది. ఈ దేవాలయము జానకంపేట సమీపంలో గుట్టపైన వెలిసి ఉంది. ఈ దేవాలయము వద్ద అష్టముఖి కోనేరు ఉంది ఈ అష్టముఖి కోనేరులో శనివారం వచ్చే అమావాస్యతో కూడిన రోజు వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించి లక్ష్మీ నరసింహా స్వామి అనుగ్రహాన్ని పొందుతారు.ఈ ఆలయానికి మహారాష్ట్ర కర్ణాటక ఆంధ్ర తెలంగాణ ప్రజలు తండోపతండాలుగా వస్తారు. ఈ ఆలయంలో ప్రతినెల స్వాతి నక్షత్రం రోజున శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి కళ్యాణం నిర్వహిస్తామని చైర్మన్ చిలుక రవి, పూజారి కొండాచార్యులు తెలిపారు.

# ఎన్ సి ఎస్ టి సభ్యులు జాటోత్ హుస్సేన్ కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి జిల్లా ఆగస్టు 25 ( డీకే చాటింపు ) జిల్లా పర్యటనకు విచ్చేసిన నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎన్ సీ ఎస్ టీ ) సభ్యులు జాటోత్ హుస్సేన్‌కు సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి సభ్యులను సాదరంగా ఆహ్వానించారు. ఆదివాసులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న హక్కులు చట్టబద్ధమైన పథకాలు వనరులు జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు,విద్య వైద్య వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో చర్చించారు.

జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గిరిజనులకు మెరుగైన మౌలిక వసతులు, విద్య, వైద్యంతదితర రంగాల్లో అందిస్తున్న సేవలపై ఎన్సి ఎస్ టి సభ్యులు జాటోత్ హుస్సేన్ కు జిల్లా సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐ టీ డీ ఏ పీఓ రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు చుట్టూ దుమారం!

**హైదరాబాద్,** , తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంక్షేమ పథకాల చుట్టూ తీవ్ర దుమారం రేగుతోంది. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అమలవుతున్న ప్రతిష్టాత్మక కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఊరూరా కాంగ్రెస్ నేతలను నిలదీయాలని, లబ్ధిదారుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.ఈ పథకాలపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులే తాజా రాజకీయ వివాదానికి ప్రధాన ఆజ్యం పోశాయి. 2014 నుంచి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలకు అసెంబ్లీ చట్టబద్ధత లేదంటూ ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, ఆ జీవోలపై స్టే విధిస్తూ చెల్లింపులను నిలిపివేయాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరపున సకాలంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం వల్లే కోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు వ్యవహారాన్ని సాకుగా చూపి రూ. 1,00,116 ఆర్థిక సాయం అందించే పథకాలను పూర్తిగా ఎత్తివేసే ఆలోచనలో కాంగ్రెస్ ఉందని బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు.

ఈ వివాదం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. ఇందుకు పలు కీలక అంశాలు కారణమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచిన కేసీఆర్ కిట్, రైతుబీమా, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం క్రమంగా పక్కన పెడుతోందనే రాజకీయ విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యూహాన్ని గులాబీ పార్టీ అమలు చేస్తోంది.క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే, ప్రభుత్వం

కల్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ఎక్కడా అధికారికంగా ప్రకటించలేదు. వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా ఈ పథకాలకు నిధుల కేటాయింపులు కూడా కొనసాగుతున్నాయి.హైకోర్టు స్టే వ్యవహారంలోనూ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నేతలు కొట్టిపారేస్తున్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం, ఆగస్టు,25, 2026

# ఎల్‌నినో సవాలు..

2026 వర్షాకాలం మనకు నేర్పుతున్న శాస్త్రం, తత్వం, జీవన సత్యం ఏమిటంటే... జీవసృష్టి ఎప్పుడూ ఒకే సమాధానం చెప్పదనే. మనిషి ఒక సమస్యను చూస్తే, ఈ భూగోళం దానికి ఎన్నో ప్రత్యామ్నాయాలను తన గర్భంలోనే దాచిపెడుతుంది. మనం ఆకాశం వైపు చూసి వర్షాన్ని ఊహిస్తాం, శాస్త్రవేత్తలు ఉపగ్రహాల డేటాను విశ్లేషించి అంచనాలు వేస్తారు, రైతు మాత్రం నేలను తాకి కాలం గురించి చెబుతాడు. కానీ వాతావరణం ఎవరి అంచనాలకూ పూర్తిగా లొంగదు. తన సమతుల్యతను కాపాడుకోవడానికి ఎప్పటికప్పుడు స్వతంత్ర మార్గాలను వెతుక్కుంటుంది. 2026 నైరుతి రుతుపవనాలు మనకు నేర్పిన అత్యంత లోతైన పాఠం ఇదే. ఈ ఏడాది కథ కేవలం కురిసిన వర్షాల గురించి మాత్రమే కాదు. ఒక సంక్షోభం ఎదురైనప్పుడు సహజ ప్రపంచం తనలోని అంతర్గత శక్తిని ఎలా మేల్కొల్పుతుందో చెప్పే అరుదైన శాస్త్రీయ, తాత్విక కథనం ఇది. పసిఫిక్ మహాసముద్రంలోని నీటి ఉష్ణోగ్రత కొద్దిగా పెరగడం అనేది వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత రైతు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? ఇదే వాతావరణ శాస్త్రంలోని సంక్లిష్టమైన "టెలికనెక్షన్స్" అద్భుతం. ఎల్ నినో అనేది ఒక ప్రాంత సమస్య కాదు. అది ప్రపంచ గాలుల లయను మార్చే శక్తి. మేఘాల ప్రయాణాన్ని అడ్డుకుంటూ, తేమ ప్రవాహాన్ని బలహీనపరిచి రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీస్తుంది. ఈ ఏడాది జూన్ నెలలో సరిగ్గా అదే జరిగింది. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 10% కంటే ఎక్కువ లోటును నమోదు చేసింది. పశ్చిమ, మధ్య భారతదేశంలో పొలాలు ఎండిపోగా, విత్తనాలు రైతుల చేతుల్లోనే ఉండిపోయాయి. "ఈసారి కరువు తప్పదా?" అనే ప్రశ్న దేశమంతా వినిపించింది. కానీ జూలై రాగానే కథ ఊహించని మలుపు తిరిగింది. జూలైలో కురిసిన సమృద్ధియైన వర్షాలు జూన్ లోటును పూర్తిగా భర్తీ చేయడమే కాకుండా, సాధారణ స్థాయి కంటే అదనపు వర్షపాతాన్ని అందించాయి. ఒకే ఒక్క నెల వ్యవధిలో వాతావరణం తన సమీకరణాన్ని మార్చుకుంది. సాధారణంగా వర్షం అనగానే బెంగాల్ ఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, పసిఫిక్ నుంచి వీచే తేమ గాలులే గుర్తుకొస్తాయి. కానీ ఈసారి కథ కొంచెం భిన్నంగా సాగింది. మధ్య భారతదేశం, దక్షిణ భారతదేశం, పశ్చిమ కనుమలలో వేడెక్కిన నేలకూ, చుట్టూ ఉన్న సముద్రాలకు మధ్య ఉష్ణోగ్రత వ్యత్యాసం గణనీయంగా పెరిగింది. దీనికి స్థానిక తేమ తోడవడంతో ఉపఖండం లోపలే వరుసగా దేశీయ అల్పపీడన వ్యవస్థలు రూపుదిద్దుకున్నాయి. బయటి గాలుల సహకారం తగ్గినా, భారత ఉపఖండపు అంతర్గత వ్యవస్థలే సొంతంగా వర్ష మేఘాల గొలుసును నిర్మించుకున్నాయి. భారత వాతావరణ శాఖకి చెందిన నిపుణులు ఈ పరిణామాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ: "పసిఫిక్ నుంచి తేమ ప్రవాహం క్షీణించినప్పుడు, భారత భూభాగంపై ఏర్పడిన స్థానిక అల్పపీడనాలు మరియు మధ్యప్రాంత వాతావరణ సుడిగుండాలు కలసి స్థానిక తేమను వర్షంగా మార్చాయి. ఇది అంతర్జాతీయ గాలులపై ఆధారపడకుండా నిలబడిన ఒక ప్రత్యేక స్థానిక వాతావరణ ప్రతిస్పందన." అన్నారు. జీవపరిణామ శాస్త్రంలో ఒక అందమైన సూత్రం ఉంది. అదే "రిజిలియెన్స్". అంటే దెబ్బతిన్న తర్వాత కూలిపోకుండా, కొత్త రూపంలో మళ్లీ నిలబడే సామర్థ్యం. నది ప్రవాహం: ఒక నదికి పెద్ద బండరాయి ఎదురైతే అది తన ప్రయాణాన్ని ఆపదు; ఆ రాయి పక్కనుంచే ఒక కొత్త దారిని సృష్టించుకుని ముందుకు సాగుతుంది. మానవ రోగనిరోధక వ్యవస్థ: మన శరీరానికి వైరస్ సోకినప్పుడు రోగనిరోధక వ్యవస్థ తన లోపల నుంచే కొత్త యాంటీబాడీలను తయారుచేసి పోరాడుతుంది. వెదురు చెట్టు: తుఫాను వచ్చినప్పుడు వెదురు చెట్టు విరిగిపోదు, గాలికి అనుగుణంగా వంగుతుంది. గాలి తగ్గగానే మళ్లీ నిటారుగా నిలబడుతుంది. సహజ ప్రపంచం కూడా సరిగ్గా ఇదే చేసింది. ఎల్ నినో ఒక దారిని బలహీనపరిస్తే, మన భారతీయ భూభాగం మరొక అంతర్గత దారిని తెరిచింది. జూలై వర్షాలు ఖరీఫ్ పంటలకు ప్రాణం పోయడమే కాక, ఎండిపోతున్న జలాశయాలను, భూగర్భ జలాలను వేగంగా నింపాయి. అయితే ఈ విజయంతో ఎల్ నినో ప్రమాదం ముగిసిపోయిందని భావించడం సరైంది కాదు. శాస్త్రం అలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోదు. ప్రస్తుతం లభ్యమవుతున్న డేటా ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో "బ్రేక్ మాన్సూన్" (వర్షాలు లేని పొడి విరామాలు) వచ్చే అవకాశం ఉందనే హెచ్చరికలు ఉన్నాయి

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు
ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# ఎకరానికి మూడు బస్తాలు యూరియా ఇప్పించండి
## ఆర్మూర్ ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నరైతులు

ఆర్మూర్ విలేఖరి ఆగస్టు 24 (డీకే చాటింపు): ఆర్మూర్ పట్టణానికి చెందిన ఆరు పంతల సంఘం రైతులు ఈరోజు అంకాపూర్ లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి యూరియా ఆన్లైన్లో బుకింగ్ కావడం లేదని ఎకరానికి మూడు బస్తాల యయూరియా ఇప్పించండి అని మొరపెట్టుకున్నారు. ఆర్మూర్ పట్టణ శివారు రైతులకు యూరియా బుక్ కావడం లేదు అని వరి,మొక్క జొన్న పంటలు చేతికి వచ్చే సమయం కావడంతో యూరియా యాప్ లేకుండా సొసైటి ద్వారా రైతుల పంట పాసు బుక్ ద్వారా ఒకొ రైతుకు ఎకారానికి మూడు బస్తాల యురియాను ఇప్పించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్రావు తో ఫోన్ లో మాట్లాడి సమస్య తెలియజేయడం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి స్పందిస్తూ యాప్ లో సాంకేతిక సమస్య ఉంది అని, ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది. ఆర్మూర్ డివిజన్లోని రైతులు యూరియా అంధక పంట చేతికి వచ్చే సమయంలో ఇలాంటి పరిస్థితులు రావడం చాలా



బాధాకరంగా ఉందని రైతులు వాపోయారు. ఆన్లైన్ యాప్ తొలగించి వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి ఒక్కరైతుకు ఎకరానికి మూడు యూరియా బస్తాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు వ్యవసాయ మంత్రికి విన్నవించారు, ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ ,జిల్లా వ్యవసాయ అధికారి ని సంప్రదించి సమస్య తొలగించే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

# ఆర్మూర్లో ఘనంగా జండా జాతర ఉత్సవం
## బాలాజీ జెండా జాతరకు స్వాగతం పలికిన అంకాపూర్ గ్రామస్తులు



ఆర్మూర్ విలేఖరి ఆగస్టు 24 (డీకే చాటింపు):ఆర్మూర్ పట్టణంలో అనాదిగా వస్తున్న బాలాజీ జండా జాతర ఆదివారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పూజలు చేసి జాతర ప్రారంభించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో జరిగేయి తొమ్మిది రోజుల పూజ అనంతరం జెండాను పురవీధుల్లో ఊరేగించి అంకాపూర్ కు సాయంత్రం చేరుతుందని సర్వ సమాజ్ అధ్యక్షుడు సుమన్ తెలిపారు.జండా జాతర వందల ఎల్ల క్రితం ఆర్మూర్ సంస్థానం వారు యమునా భాయి శ్రీనివాస రెడ్డి కుటుంబం ప్రారంభిశీచారనీ హిందూ ధర్మ పరిరక్షణ ద్యేయంగా పని చేస్తున్నామని,ప్రజలు కూడా ధర్మం కాపాడుతూ ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు. జండా బాలాజీ జాతరలో మహిళలు గ్రామస్తులు వివిధ సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి
## ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల,ఆగస్టు24,(డీకే చాటింపు): సోమవారం జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యం తో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది.ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం




ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో వారాహి సిల్క్స్
# నూతన షోరూమ్ ఘనంగా ప్రారంభం
## ముఖ్య అతిథులుగా హాజరైన సినీ తారలు తేజ సజ్జ, మీనాక్షి చౌదరి

ఎల్బీనగర్ , (డీకే చాటింపు ) వనస్థలిపురం: ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ 'వారాహి సిల్క్స్' తమ నూతన షోరూమ్‌ను వనస్థలిపురంలో అత్యంత వైభవంగా ప్రారంభించింది. ఈ వేడుకకు టాలీవుడ్ యువ కథానాయకుడు తేజ సజ్జ, కథానాయిక మీనాక్షి చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. వివాహాలు, పండుగలకు సరికొత్త డిజైన్లు: సినీ నటుడు తేజ సజ్జ హీరో తేజ సజ్జ మాట్లాడుతూ, "వనస్థలిపురంలో వారాహి సిల్క్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ సాంప్రదాయ పట్టు చీరల నుంచి ఆధునిక ఫ్యాషన్ దుస్తుల వరకు అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. వివాహాలు, శుభకార్యాలు, పండుగలకు సరిపడే సరికొత్త డిజైన్లు ఒకే చోట లభించడం ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. సంస్థ యాజమాన్యానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. మహిళల మనసు దోచే కలెక్షన్స్: సినీ నటి మీనాక్షి చౌదరి హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, "వారాహి సిల్క్స్ కలెక్షన్ చూసి నేను ఎంతగానో ముగ్ధురాలినయ్యాను. మహిళల అభిరుచికి తగ్గట్లుగా కాంచీపురం, బనారసి వంటి సంప్రదాయ పట్టు చీరలతో పాటు ట్రెండీ డిజైన్లు కూడా చాలా బాగున్నాయి. నాణ్యత, సరసమైన ధరలతో పాటు వినియోగదారులకు




ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని అందించేలా ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దారు. వారాహి సిల్క్స్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.సినీ తారల రాకతో షోరూమ్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక చవితి అంటే ప్రకృతి పండగ


-- యువత నెలకొల్పే మండపాల్లో మట్టి గణపతి విగ్రహాలకు ప్రాధాన్యతనివ్వాలి.- జాగృతి అభ్యుదయ సంఘం మట్టి గణపతి విగ్రహాల ప్రచార కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

హైదరాబాద్, ఆగష్టు 23 ( డీకే చాటింపు ) వినాయక చవితి అంటే ప్రకృతిని పూజించే పండగ అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా సహజమైన మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని ఆయన పిలుపునిచ్చారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా మన సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు ప్రకృతిని, జల వనరులను కూడా పరిరక్షించవచ్చని తెలిపారు.మట్టి గణపతులను పూజించిన అనంతరం మంచినీటిలో నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా వినాయక చవితిని జరుపుకోవచ్చని మధుయాష్కీ గౌడ్ సూచించారు.ఈ సందర్భంగా మట్టి గణపతికి జైలి కొడుతూ, పర్యావరణహితమైన వినాయక చవితిని ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, బి.ఎన్. రెడ్డి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మకుటం సదాశివుడు, జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్, యన్. శరత్ బాబు, మహేష్, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొట్టెల కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్



ఎల్బీనగర్, ఆగష్టు 24 (డీకే చాటింపు) కొత్తపేట్ బోనాల జాతరలో భాగంగా చైతన్యపురి డివిజన్ లోని మారుతీ నగర్ లో బొట్టు నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి.తరువాత న్యూ ఇందిరా నగర్ సాయి ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి:జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిరాల్ (డీకే చాటింపు),ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉ ందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరిలో మెగావైద్యశిబిరం
## 520 మందిరోగులకు వైద్య పరీక్షలు




నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 24 (డీకే చాటింపు): రామకృష్ణ మఠం హైదరాబాద్ గ్రామ శ్రీ వైద్యసేవ ఆధ్వర్యంలో కోటగిరి వివేకానంద పాఠశాలలో శ్రీ రామకృష్ణ సేవా సమితి కోటగిరి వారు నిర్వహించిన వైద్య శిబిరంలో 528మంది రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కార్డియాలజీ డాక్టర్ సుజని కిమ్స్ కొండాపూర్, డాక్టర్ దిలీప్ కుమార్ ఎండి జనరల్ మెడిసిన్ నిజామాబాద్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రమ్య జనరల్ ఫిజీషియన్, ఈఎన్టి బృందం, డాక్టర్ జామ్ కార్ ఎండి, దంత వైద్యులు డాక్టర్ శీను నాయక్, ఫిజియోథెరపీ డాక్టర్ మహేష్, రక్తహీనతకు సంబంధించిన వైద్యులు పాల్గొన్నారు, కార్డియాలజీ 58, కంటి పరీక్షలు 120, ఈఎన్టి 43, జనరల్ 97, ఫిజియోథెరపీ 50, దంత, పరీక్షలు 40 , రక్తహీనత 120 మొత్తం 528 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్ల మధుకర్,కోనేరుశశాంక్ ,రామకృష్ణ మఠం దోమలగూడ గ్రామ శ్రీ సేవలో భాగంగా కోఆర్డినేటర్ వేణు, కోటగిరి రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు గోగినేని శివ శ్రీనివాస్, సభ్యులు హనుమంతరావు, నితిన్ చంద్ర, తోట శ్రీకాంత్,గర్దాస్ గంగాధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## లండన్ లో నిజాంబాద్ జిల్లా వాసి మీట్ అండ్ గ్రీట్ లో క్రియాశీల పాత్ర




నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 24 (డీకే చాటింపు):లండన్ లో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ద్వారా ప్రావాస భారతీయుల కొరకు నిర్వహించడం జరిగింది . లండన్ లోని తాజ్ హోటల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ పిసిసి ఎన్ఆర్ఐ కన్వీనర్ సుధాకర్ గౌడ్, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధి రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాన్ని విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభాస్ తెలంగాణ సమాజం ముందుకు రావాలని భవిష్యత్తు ప్రణాళికలపై అభివృద్ధిపై సీఎం వివరించారు. ఎన్నారైలు తమ జ్ఞానం అనుభవాన్ని తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటున అందించాలని కోరారు.తెలంగాణలోని తెలుగు కమ్యూనిటీ నాయకులతో పాటు వివిధ రంగాలలో చెందిన నిపుణులు పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే లే అవుట్లకు అనుమతులు :జిల్లా కలెక్టర్ ప్రియాంక...

**-మూడు లే అవుట్లకు అనుమతులు మంజూరు... -మరో మూడు లే అవుట్ల దరఖాస్తులు తిరస్కరణ... -జిల్లా లే అవుట్ కమిటీ సమావేశం... -ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి...**





నారాయణపేట,(డీకే చాటింపు): ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని నారాయణపేట జిల్లా కలెక్టర్ సి. హెచ్.ప్రియాంక స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి,పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.కమిటీ పరిశీలనకు వచ్చిన జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన 6 లే అవుట్ దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల క్లియరెన్స్ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

కమిటీ పరిశీలన అనంతరం 3 లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయగా,మరో 3 లే అవుట్ల దరఖాస్తులను తిరస్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రక్రియను సులభతరం చేయడం, సమయాన్ని తగ్గించడం, అనవసరమైన భౌతిక సమావేశాలను నివారించడమేనని కలెక్టర్ తెలిపారు.ఆన్‌లైన్‌లో పరిశీలన పూర్తయిన తర్వాత కూడా ప్రతి దరఖాస్తుకు మళ్లీ భౌతిక సమావేశం నిర్వహిస్తే ప్రక్రియ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే,ఆ అభ్యంతరాన్ని సిస్టమ్‌లోనే నమోదు చేసే విధానం ఉండాలని సూచించారు. అభ్యంతరం నమోదైన సందర్భంలో సంబంధిత ఫైల్‌ను తదుపరి స్థాయికి ఆటోమేటిక్‌గా పంపించేలా ప్రక్రియను రూపొందించవచ్చని తెలిపారు.అన్ని శాఖల అధికారులు ఆమోదించిన దరఖాస్తులకు మళ్లీ ప్రత్యేకంగా భౌతిక సమావేశం నిర్వహించాల్సిన అవసరం లేకుండా,ఆన్‌లైన్‌లోనే తదుపరి ప్రక్రియకు ఫైల్‌ను పంపించే విధానం అమలు చేస్తే సమయం,శ్రమ రెండూ ఆదా అవుతాయని స్పష్టం చేశారు.ఏదైనా అంశంపై అభ్యంతరం ఉన్న దరఖాస్తులను మాత్రమే భౌతిక సమావేశానికి తీసుకువచ్చి చర్చించి నిర్ణయం తీసుకునే విధానం మరింత సమర్థవంతంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఇకపై ప్రతి లే అవుట్‌లోనూ రహదారుల ఇరువైపులా మొక్కలు నాటే నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు,లే అవుట్లలో పచ్చదనం పెంపొందించేందుకు ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీను,పంచాయతీరాజ్ ఈఈ అశోక్,నీటిపారుదల శాఖ ఈఈ సాల్మన్,ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, డీటీసీపీఓ కిరణ్,కోస్గి,మక్తల్, మద్దూరు టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం14 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు.శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ పర్యటనకు విచ్చేస్తున్న తెలంగాణ గవర్నర్



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 24 (డీ కే చాటింగ్)తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆగస్టు 25న మంగళవారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని పసుపు బోర్డు కార్యాలయంలో రైతులతో మార్కెట్ లింకేజీ కార్యక్రమంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాంలో పాల్గొంటారనీ అధికారులు తెలిపారు. నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి హెచ్ ఆర్ కన్వెన్షన్ లో నిర్వహించే కార్యక్రమంలో కూడా ముఖ్యఅతిథిగా గవర్నర్ పాల్గొంటారని తెలిపారు.

# నారాయణపేట జిల్లాలోఎస్ఎఫ్ఐ నేతల అరెస్టు

**-ముందస్తు అరెస్టులను ఖండించాలి... -పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి... -ఎస్ఎఫ్ఐ ధర్నాకు అనుమతి ఇవ్వాలి... -విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండించాలి...**







నారాయణపేట,(డీకే చాటింపు): పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని,విద్యా ప్రైవేటీకరణను అడ్డుకోవాలని,జీ.ఓ.నెం. 97ను రద్దు చేయాలని,శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ఎస్ఎఫ్ఐ నిర్వహించ తలపెట్టిన ధర్నాకు అనుమతి నిరాకరించడం, విద్యార్థి నేతలను ముందస్తుగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో చలో ఇంద్ర పార్క్ భాగంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా విద్యార్థి నేతలను పోలీసులు సోమవారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకే ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఆయన పేర్కొన్నారు.నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు నారాయణపేట రూరల్, దామరగిద్ద,కోస్గి,మాగనూర్, మక్తల్,నర్వ,మద్దూర్ తదితర ప్రాంతాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కోస్గిలో భాను ప్రసాద్, నారాయణపేట రూరల్‌లో నరహరి,దామరగిద్దలో మహేష్ యాదవ్,కనకప్ప యాదవ్,మద్దూర్‌లో రియాజ్‌తో పాటు మద్దూర్ నాయకులు,నర్వలో మమత,మహేందర్‌తో పాటు నర్వ నాయకులు, మాగనూరులో నయీమ్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతం గా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిందని,అలాంటి ప్రజాస్వామ్య నిరసనలకు అనుమతి నిరాకరించి, ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని పవన్ కుమార్ విమర్శించారు."రాజ్యాంగాన్ని పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ.తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై మాట్లాడాలి"అని ఆయన డిమాండ్ చేశారు. "మాట్లాడేది ప్రజా ప్రభుత్వం అంటారు.చేసేది ప్రజాస్వామ్య ఖూనీ!"అని పేర్కొంటూ,ప్రశ్నలను తట్టుకోలేని,ప్రజల హక్కులను హరించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు.విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలను అరెస్టు చేయడం,ధర్నాకు అనుమతి నిరాకరించడం వెంటనే నిలిపివేయాలని,ఎస్ఎఫ్ఐ ధర్నాకు అనుమతి ఇవ్వాలని,అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ముందస్తు అరెస్టులను ఖండించాలని కోరారు.

## కొత్తగూడెం పట్టణ యాదవ యువజన నూతన కమిటీ ఎన్నిక ముఖ్య అతిధులు గా టీ పి సీ సీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు

భద్రాద్రి కొత్తగూడెం , ఆగస్టు 25 ( డి కే చాటింపు ) అఖిల భారత యాదవ మహాసభ కొత్తగూడెం పట్టణ కమిటీ సమావేశంలో పట్టణ యాదవ యువజన కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని యాదవ పెద్దల సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశానికి టీ పీ సీ సీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యువజన కమిటీ సభ్యులను వారు అభినందించారు. యాదవ యువత ఐక్యతతో ముందుకు సాగుతూ, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. భవిష్యత్తులో యాదవ సమాజానికి దిక్సూచిగా నిలిచి, యువతను చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో యాదవ కుల పెద్దలు, జిల్లా నాయకులు, అధ్యక్షులు కోదాడ శ్రీనివాస్ యాదవ్, కౌడగాని శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చిలక రవి యాదవ్, పట్టణ కమిటీ నాయకులు వేల్పుల కుమార్ యాదవ్, అంబుల వేణు యాదవ్, బొమ్మిడి రమాకాంత్ యాదవ్, ఆవాల శ్రీనివాస్ యాదవ్, సకినాల సమ్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. యువ నాయకులు బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్,



జడల నాని యాదవ్ తదితరులు హాజరయ్యారు.

పట్టణ అధ్యక్షుడిగా పల్లా దేవి వరప్రసాద్ (డీవీపీ) యాదవ్, ఉపాధ్యక్షులుగా అద్దాల అశోక్ యాదవ్,ఆవాల సునీల్ యాదవ్, సురిమినేని హరీష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కంచం మధు యాదవ్, కార్యదర్శులుగా అమృతవల్లి ప్రవీణ్ యాదవ్, బైకాను హరిప్రసాద్ యాదవ్, ముత్యాలఅజయ్ యాదవ్ ఎంపికయ్యారు. కోశాధికారిగా మీసా వేణు యాదవ్, సహాయ కోశాధికారిగా మామిడి శ్రీనివాస్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా కొంచెం సందీప్ యాదవ్, జునుమాల వంశీ, జడల మధుబాబు, కంచం సందీప్ తదితరులను ఎన్నుకున్నారు.

# నిర్దేశిత గడువులోపు పనులు చేయాలి
# నేడే వన మహోత్సవం

**-చేయూత పథకంలో అర్హులైన లబ్ధిదారులను నమోదు చెయ్యాలి... -నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక... -వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్ష...**



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక సోమవారం కలెక్టరేట్ ప్రజా వాణి హాల్లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న(మంగళవారం) నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమంలో మండల స్థాయి,గ్రామ పంచాయతీ స్థాయి సిబ్బంది అందరూ తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.విస్తృతంగా మొక్కలు నాటి,వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చేయూత పథకంపై... చేయూత పథకానికి సంబంధించి ఎంపీడీవోలు, ఎంపీవోలు,పంచాయతీ కార్యదర్శులు ఈనెల 31 లోగా,సాధ్యమైనంత వరకు అంతకంటే ముందుగానే అర్హులైన లబ్ధిదారుల నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు.అర్హులైన దరఖాస్తులన్నింటినీ సంబంధిత విండో ద్వారా నమోదు చేయాలని సూచించారు.ఒంటరి మహిళలు, వికలాంగులు, తలసిమియా,సికిల్ సెల్ ఎనీమియా,ఫైలేరియా, డిస్ఫేసియా తదితర అర్హత కలిగిన వారు కూడా ఈ పథకం ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాన్ని కోల్పోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వీలైనంత త్వరగా జారీ చేయాలని సూచించారు.

జిల్లా స్థాయి అధికారులు తమ పరిధిలోని డీసీహెచ్ బీ -2027కు సంబంధించిన డేటా సేకరణ,నమో దు ప్రక్రియను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమాచారాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు.

ఉల్లాస్ పై... వీటితో పాటు ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి ఏ.పీ.వోలు పాల్గొన్న వీవోఏ తమ పరిధిలోని పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.తాను స్వయంగా ఉల్లాస్ కేంద్రాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. అభ్యాసకుల శిక్షణ,అభ్యాస ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అభ్యాసకులకు సర్టిఫికెట్లు అందజేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాల యూనిఫాంల తయారీకి అందిన మెటీరియల్ ఏదైనా, వివోఏ,నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ యూనిఫాంల కుట్టు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అందించే అన్ని యూనిఫాంలు నిర్దేశిత నమూనా,కొలతలు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చెకింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

**ప్రతి గ్రామ పంచాయతీలో 5 వ్యవసాయ చెరువులో పనులు...**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 5 వ్యవసాయ చెరువుల పనులను చేపట్టి పూర్తి చేయడంతో పాటు,50 నుంచి 100 మంది వరకు కూలీలకు ఉపాధి కల్పించేలా పనులను గుర్తించి అమలు చేయాలని ఆదేశించారు.

అలాగే వీబిజీ రామ్ జీ కింద అనుమతించబడిన పనులను వేగవంతంగా పూర్తి చేసి,గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు నీటి సంరక్షణకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు.ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు బాధ్యతగా తీసుకొని,గడువులోగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.

## పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖలోనే కొనసాగించాలి

సిద్దిపేట : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు కావస్తున్నా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిలేక విద్యార్థుల సమస్యలు పట్టించుకునేనాథుడే లేకుండాపోయిందని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖ నుండి ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నాడని, సాంకేతిక విద్యా శాఖ లోనే కొనసాగించాలని సిద్దిపేట లో ఉమేన్స్ పాలిటెక్నీక్ కళాశాల విద్యార్థులు ధర్నా కు బిఆర్ఎస్ విద్యార్తి విభాగం నాయకులు మద్దతు పలికారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు ఏడు దశాబ్దాల సుదీర్ఘ ఘన చరిత్ర ఉందని, ఎందరో నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యనభ్యసించి దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 95% మంది నిరుపేద విద్యార్థులు నామమాత్రపు కళాశాల ఫీజు కట్టి నాణ్యమైన ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమా స్థాయిలోనే నేర్చుకుంటున్నారని ఇలాంటి పటిష్టమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యాచట్టం పరిధి నుండి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పబ్లిక్- ప్రైవేట్ పార్ట్నర్షిప్ చట్టం పరిధిలో చేర్చడం వలన నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయని తద్వారా పాలిటెక్నిక్ వ్యవస్థ పతనమవుతుందని ఆవేదన వ్యక్తంచేసారు.ప్రభుత్వం ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణలు చేపట్టకపోవడం, ఇప్పటికీ స్పష్టమైన విధివిధానాలు బహిర్గతం చేయకపోవడం వలన ప్రస్తుతం




పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం తమ భవిష్యత్ గురించి అయోమయంలో ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ నిర్వీర్యానికి దారితీసే జీవో 97 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర మంత్రిమండలి అమోదించిన శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు అండగా నిలబడి శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం బిల్లు చట్టబద్ధం కాకుండా ఎఐసీటీఈ ప్రమాణాలతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే ఎస్బీటీఈటీ బోర్డు పర్యవేక్షణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ యధాతతంగా కొనసాగేలా పోరాటంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు బాసటగా బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని వారు తెలిపారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి

## -ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి
## -లాటరల్ ఎంట్రీ అవకాశాలను కొనసాగించాలి
## -శక్తి విధానాన్ని వెనక్కి తీసుకుని ఎస్‌బీటీఈటీని బలోపేతం చేయాలి
## -పీవైఎల్ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్

**కారేపల్లి :**తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించడంతో పాటు సాంకేతిక విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. కారేపల్లి మండల పరిధిలోని ఎస్సీ వసతి గృహ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, వాటి బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్య విధానంలోకి తీసుకెళ్లే చర్యలను తక్షణమే నిలిపివేయాలని కోరారు.జీవో నంబర్ 97/2026లో పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి ఉపయోగపడే లాటరల్ ఎంట్రీ అవకాశాలను కొనసాగించాలని, వాటిని కోల్పోయే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని సాంకేతిక విద్యకు కీలకమైన స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) పాత్రను కొనసాగిస్తూ మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న శక్తి విధానం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యలోకి వెళ్లే అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని శివ నాయక్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శక్తి విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో అమలు చేస్తున్న జీవో నంబర్ 97/2026ను తక్షణమే వెనక్కి తీసుకుని రద్దు చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని పీవైఎల్ తరఫున భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు.

# పుష్కర సాగునీరు అందించలేకపోతే రైతులకు ఎకరాకు 20 వేలు ఆర్థిక సహాయం ప్రకటించాలి : పాటంశెట్టి సూర్యచంద్ర

## -జగ్గంపేట నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి

జగ్గం పేట : పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణానికి సుమారు 52 కోట్లతో పాత సిమెంట్ పైప్‌లైన్ స్థానంలో ఎంఎస్ పైప్‌లైన్ ఏర్పాటు, పంప్‌హౌస్, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులు చేపట్టారు. ఈ పనులు వాస్తవానికి వేసవికాలంలో పూర్తిచేసి,ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు నీరు అందించాల్సి ఉంది. అయితే వేసవిలో పూర్తి చేయాల్సిన పనులను వర్షాకాలంలో చేపట్టడం,పనుల్లో వేగం లేకపోవడం వల్ల నేడు వేలాది ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని సూర్యచంద్ర తెలిపారు. ×2025 సెప్టెంబర్ 10న అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్, డిసెంబర్ 10 నాటికి టెక్నికల్ శాంక్షన్, టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు, 2026 ఫిబ్రవరి 6 నుంచి పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా సంబంధిత కాంట్రాక్టర్ మెగా కంపెనీ వారికి వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే పనులు ప్రారంభించిన తరువాత కూడా వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన యంత్రాలు, సిబ్బందిని సమృద్ధిగా వినియోగించలేదని ఆయన విమర్శించారు. మే 7వ తేదీన తాము పుష్కర పనులను స్వయంగా పరిశీలించినప్పుడు, మూడు నెలల్లో కేవలం సుమారు 10 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన సమయంలో 90 శాతం పనులు పూర్తి చేయడం కష్టమని ముందుగానే అధికారులు, ఎమ్మెల్యే గారి దృష్టికి మీడియా ద్వారా తీసుకెళ్లామని సూర్యచంద్ర తెలిపారు. ఆ సమయంలో కేవలం రెండు ప్రొక్లెయినర్లు మాత్రమే పనిచేస్తున్నాయని, కనీసం 20 ప్రొక్లెయినర్లు, హైడ్రాలు తదితర యంత్రాలను వినియోగించి యుద్ధప్రాతిపదికన పాత పైపులు తొలగించి కొత్త పైపులు ఏర్పాటు చేయాలని కోరామని ఆయన చెప్పారు. అప్పుడే పనులను వేగవంతం చేసి ఉంటే నేడు రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదని అన్నారు. మే 13న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుష్కర పథకాన్ని పరిశీలించి,మే 19న విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని ప్రకటించారని సూర్యచంద్ర తెలిపారు. లోకేష్ పర్యటన రద్దు కావడంతో మే 19న ఎమ్మెల్యే గారు శంకుస్థాపన చేసి, జూలై 20 నాటికి తప్పనిసరిగా రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. జూలై 20న పనులను పరిశీలించిన తరువాత కూడా పనులు ఆలస్యంగా ప్రారంభమైనందున పూర్తి కాలేదని, ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా నీరుఅందిస్తామని మరోసారి హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే గారి హామీని నమ్మిన రైతులు నారుమడులు వేసుకున్నారని,ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ బిందెలతో నీరు పోసి నారుమడులను కాపాడుకునే ప్రయత్నం చేశారని, అనేక నారుమడలు ఇప్పటికే ఎండిపోయాయని సూర్యచంద్ర ఆవేదన వ్యక్తం చేశారుఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఈ పనులకు శంకుస్థాపన ఫిబ్రవరి నెలలోనే సంబంధిత ఇరిగేషన్ శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు గారి చేతుల మీదుగా నిర్వహించి ఉంటే, వేసవి కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని పనులను వేగంగా పూర్తి చేసే అవకాశం ఉండేదని సూర్యచంద్ర అన్నారు. ఇరిగేషన్ పనులకు విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపనాచేయించాలనే నిర్ణయం కారణంగా సమయం వృథా అయిందని ఆయన విమర్శించారుక్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మొదటి పైప్ లైన్ పూర్తి కావడానికి మరో 15 నుంచి 20 రోజుల సమయం పడుతుందని, రెండవ పైప్ లైన్ రెండు నుండి మూడు నెలలు కాలం పట్టే పరిస్థితి ఉందని సూర్యచంద్ర తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, పంప్‌హౌస్ పనులు కూడా పూర్తిస్థాయిలో పూర్తికాలేదని ఆయన పేర్కొన్నారురెండు పైప్‌లైన్లు పూర్తయి, మొత్తం ఐదు మోటార్లను నడిపితే సుమారు 8 క్యూమెక్స్ అంటే సెకనుకు 8,000 లీటర్ల నీరు విడుదలవుతుందని సూర్యచంద్ర తెలిపారు. మొదటి పైప్‌లైన్‌లో రెండు మోటార్లతో సుమారు 3.20 క్యూమెక్స్ అంటే సెకనుకు 3,200 లీటర్ల నీరు మాత్రమే అందే అవకాశం ఉంటే, రెండవ పైప్‌లైన్ పూర్తికాకుండా మొత్తం 32,000 ఎకరాల ఆయకట్టుకు అవసరమైన స్థాయిలో సాగునీరు ఎలా అందిస్తారో అధికారులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారూ రైతులకు స్పష్టంగా వివరించాలని ఆయన డిమాండ్ చేశారురైతులను నమ్మించి నారుమడులు వేయించారు గత ఆరు నెలలుగా ఈసంవత్సరం పుష్కర ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని, రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలని పదేపదే చెప్పడంతో రైతులు ఎమ్మెల్యే గారి హామీలను నమ్మారని సూర్యచంద్ర తెలిపారు రైతులు నారుమడులు వేసుకున్న తరువాత వర్షాలు సకాలంలో పడకపోవడంతో,ఎండలకు నారుమడులు ఎండిపోకుండా బిందెలతో నీరు పోసి కాపాడుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు పుష్కర పనులు పూర్తికాకపోవడంతో వేలాది ఎకరాలకు నాట్లు వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు

# హుస్నాబాద్ యోజకవర్గంలో 'పల్లె పల్లెకు' పొన్నం అన్న : పల్లె పల్లెలో ప్రజా పాలన



హుస్నాబాద్ : కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం, సైదాపూర్ మండలం దుద్దెనపల్లిపల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దుద్దెనపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుద్దెనపల్లిలో ప్రజా పాలన ద్వారా జరిగిన అభివృద్ధి:ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దుద్దెనపల్లి గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. సైదాపూర్ మండలంలో మొదటి దశలో 486 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 370 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 170 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యం. అత్యంత పేదలు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యతతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. దుద్దెనపల్లిలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 29 ఇళ్లు పూర్తయ్యాయి. ఇద్దరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని రద్దు చేసుకున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా..గౌరవెల్లి ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గౌరవెల్లి కాలువలకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు. ఎల్‌ఎండీ నుంచి వచ్చే నీటి ప్రాజెక్టు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించామని, త్వరలోనే అనుమతి వస్తుందని తెలిపారు. ఎంఎంఆర్ కింద ఆగిపోయిన పనులకు కూడా త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, గ్రామ సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, రైతులు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం : ముందస్తు ఏర్పాట్లు చేయాలి



సిద్దిపేట : పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె. హైమావతి దిశ నిర్దేశం చేశారుహుస్నాబాద్ నియోజకవర్గం జిల్లాలో 3 మండలాలోనీ గ్రామాల్లో త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించబోయే పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన కార్యక్రమ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా ఆయా శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. హుస్నాబాద్ నియోజకవర్గ 3 మండలాలు కోహెడ, అక్కన్న పేట, హుస్నాబాద్ మండలంలో పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన ద్వారా రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామంలో ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న పథకాలు మరియు గ్రామాల్లో సమస్యలు గూర్చి నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతిలో సభ ఏర్పాటు టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవోలు ఆదేశించారు. శాఖల అధికారులు గ్రామాల్లో సభలో తెలిపిన దరఖాస్తులను నోట్ చేసుకుని, ఏ స్థాయిలో పరిష్కరించవచ్చు ప్రతిదీ రికార్డు చేసుకుని, ఫైలింగ్ చేసుకోవాలని ఏంపిడిఓ లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు వివరాలు, కొత్త రేషన్ కార్డులు సభ్యుల చేర్చిన వివరాలు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ మరియు సన్నవడ్లకు బోనస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా లబ్ధిదారులు, రైతు భరోసా మరియు రైతు బీమా పథకాలు లబ్ధిదారులు, కళ్యాణ లక్ష్మి శాదిముబారక్ చెక్కులు, వడ్డీలేని రుణాలు పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన వివరాలతో జాబితా తయారు చేసి గ్రామ సభలో పెట్టాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామంలో శాఖల వారిగా శాంక్షన్ అయిన పనులు, పనుల పురోగతి గూర్చి శాఖల వారిగా సమీక్ష జరుపుతారు. ప్రతి పనికి ఒక నిర్ణిత కాలం పెట్టి, ఆ నిర్ణిత కాలవ్యవధిలో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గ్రామంలో ప్రాధాన్యత అంశాలు డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ, సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్స్ ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా తేలుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి ఈ ప్రోగ్రామ్ గురించి ప్రతి గ్రామం మానిటర్ చేస్తూ, కార్యక్రమం విజయవంతం చెయ్యాలని ఆదేశించారు.

# ఉద్యోగులారా మీరు చేసే యుద్ధంలో మేమే ముందుంటాం: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్


కరీంనగర్ : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో గ్రాఫర్లను సన్మానించిన కేంద్ర మంత్రిఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 27 నుండి ఉద్యోగ సంఘాల జేఏసీ చేపట్టిన పోరుబాటకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే యుద్ధంలో బీజేపీ సైనికులే ముందుండి పోరాడేందుకు సిద్ధమన్నారు. ఈ యుద్ధంలో మీ కంటే ముందు మేమే ఉంటాం. పోలీసులు లాఠీఛార్జ్ చేస్తే ఆ దెబ్బలు మేమే తింటాం. తూటాలు పేలిస్తే ఆ తూటాలకు మేమే బలయ్యేందుకు సిద్ధం అని భరోసా ఇచ్చారు. జేఏసీలో ఒకరిద్దరు నాయకులు ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఉద్యమాన్ని వాయిదా వేయడం పరిపాటిగా మారిందని, అట్లాంటి వాళ్లను ఇకపై జేఏసీలో కొనసాగించవద్దని కోరారు. గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం, అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈరోజు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సమాజానికి ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తదితరులతో కలిసి ఉద్యోగుల జేఏసీ పోరుబాటుకు మద్దతుగా మాట్లాడారు. కరీంనగర్ డెయిరీ విషయంలో రాజకీయ కోణంలో చూడొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా. సాఫీగా సాగుతున్న కరీంనగర్ డెయిరీ ని దెబ్బతీసి వాళ్ల ఆస్తులపై కన్నేయడం సరికాదు. లక్షలాది మంది రైతులకు మేలు చేసే సంస్థ. కక్ష సాధింపు చర్యలు సరికాదు. ఏదో ఒక పేరుతో బాగా నడిచే కరీంనగర్ డెయిరీని అప్రదిష్టపాల్జేసి రైతులకు అన్యాయం చేయాలని చూడటం దుర్మార్గం. ఒక వ్యక్తిని లక్ష్యం చేసుకుని వ్యవస్థను దెబ్బతీయడం దారుణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రత్యేకంగా ఈ డెయిరీపై దృష్టి పెట్టాలి. న్యాయం చేయాలి. ప్రభుత్వం పక్షాన సాయం చేయకపోయినా ఫరవాలేదు దయచేసి అన్యాయం చేయొద్దని కోరుతున్నా.

# పాపం గోరంట్ల..!



**అనంతపురం,** : పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన.


# విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ



నెల్లూరు, : వైఎస్సార్సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

విజయవాడ, : ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం. వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షిం చడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుత్కు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది. పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు



తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది. అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

# బయిటకొస్తున్న గ్రూప్ వన్ చిట్టా...




**కడప,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో నిరుద్యోగ నియామకాల అంశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వైఎస్ఆర్సీపీ దీనిని ప్రధాన అస్త్రంగా చేసుకుని నిరసనలకు దిగుతోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించిన నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడటంతో వైఎస్ఆర్సీపీ ఇబ్బందుల్లో పడుతోంది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తీవ్రమైన ఉల్లంఘనలు, సీసీటీవీల తొలగింపు, నియమావళికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్ చేయించడం, ఎాఓఖీ స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి అక్రమాలు జరిగినట్లు సిట్ విచారణలో ఆధారాలు లభించాయి. ఒక్క నిర్ణయం వెనుక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవస్థీకృత ప్రణాళిక నడిచిందని ఫోరెన్సిక్ ఆధారాలు చెబుతున్నాయి. సాధారణంగా నంబర్-1 స్థాయి రిక్రూట్మెంట్ స్కామ్లలో ఏజెన్సీలు నిబంధనలు ఉల్లంఘించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు లేదా బోర్డు సభ్యుల పాత్రపై దృష్టి సారిస్తాయి. గ్రూప్-1 వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలపై ఇప్పటికే విచారణ సాగింది. అయితే, ఎలాంటి పొలిటికల్ గ్రీన్ సిగ్నల్ లేకుండా అంత పెద్ద వ్యవస్థాత్మక మార్పులు, ఓఎంఆర్ షీట్ల ప్రైవేటీకరణ లాంటి చర్యలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక విభాగానికి సంబంధించిన రిక్రూట్మెంట్ లోపంగా చూడటం లేదు. వైఎస్ఆర్సీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం , నాటి ముఖ్య నాయకుల సూచనలతోనే ఈ నియామకాల నిబంధనల్లో మార్పులు చేశారన్న కోణంలో సాక్ష్యాధారాలు సేకరిస్తే, విచారణ రాజకీయ నేతల దాకా వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో సిఐడి దర్యాప్తులో ఐఏఎస్ అధికారులను ప్రశ్నించినప్పుడు కొందరు ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని పరోక్షంగా చెప్పడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుత డీఎస్సీపై పోరాటం చేయడం ద్వారా నిరుద్యోగుల మద్దతు కూడగట్టాలని చూస్తున్న వైఎస్ఆర్సీపీ గ్రూప్-1 దర్యాప్తు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. మా హయాంలో సుదర్శన చక్రంలా పారదర్శకంగా మార్చాం అని చెప్పుకుంటున్నా, హైకోర్టు ఆదేశాలు , సిట్ నివేదిక వైఎస్ఆర్సీపీ వాదనను బలహీనపరుస్తున్నాయి. ఈ కేసు తీవ్రతరం అయితే, ప్రతిపక్ష నాయకులు రాజకీయంగా మరింత రక్షణలోకి వెళ్లాల్సి వస్తుందిఈ నివేదిక ఆధారంగా కోర్టు ఇచ్చే ఆదేశాలు అత్యంత కీలకం కానున్నాయి. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మాత్రమే కాకుండా నాటి విధాన నిర్ణేతలు, ప్రభుత్వ సలహాదారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది వైఎస్ఆర్సీపీలోని అగ్రనాయకత్వానికి ఊహించని రాజకీయ ప్రతిబంధకంగా మారనుంది. ఏపీలో రాజకీయం ఇప్పుడు రిక్రూట్మెంట్లు, స్కామ్ల చుట్టూ తిరుగుతోంది. గ్రూప్-1 అక్రమాల బాధ్యతను అధికారులపై మాత్రమే నెట్టివేసి ముగిస్తారా లేక సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుందా అన్నది రాబోయే రోజుల్లో సిట్ ఇచ్చే తుది ఛార్జ్‌షీట్‌తో తేలనుంది.

# క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి

విజయవాడ, నెల్లూరు, : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది. ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.

ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది. ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది. అప్పటివరకు అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం నిరాటంకంగా ప్రతిపక్ష వైఫల్యాలను, గత ఐదేళ్ల పాలనా లోపాలను ఎండగడుతూనే ఉంటుంది. శాసనసభ రికార్డుల్లో నమోదయ్యే అధికారిక చర్చలకు ఉండే రాజ్యాంగబద్ధమైన విలువ, మీడియా పాయింట్ల వద్ద లేదా పార్టీ కార్యాలయాల్లో పెట్టే ప్రెస్ మీట్లకు ఎప్పటికీ ఉండదనే ప్రాథమిక పార్లమెంటరీ సూత్రాన్ని వైఎస్సార్‌సీపీ విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.

# జోగి రమేష్ ఎపిసోడ్
# బతుకు జట్కాబండి సీరియల్



**విజయవాడ,** : రాజకీయాల్లో మైకుల ముందు నిలబడి ప్రత్యర్థులపై ఊగిపోతూ బూతులు అందుకోవడంలో స్పెషలిస్టులు అయిన జోగి ఫ్యామిలీ కుటుంబసభ్యులు ఇప్పుడు సొంత ఇంటి పంచాయతీలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట్లో జరుగుతున్న తాజా పరిణామాలు ఇప్పుడు సరిగ్గా ఏదో టీవీ ఛానల్ బతుకు జట్కా బండి పంచాయితీని తలపిస్తున్నాయి. కొడుకు వైవాహిక జీవితం, కోడలితో వివాదాలు, కుటుంబ సమస్యలు మీడియాకెక్కడంతో.. ఆ కుటుంబం బయటకు వచ్చి తలెత్తుకోవడం కష్టంగా మారుతోంది. కుమారుడి ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత బలహీనతలు, కోడలు మేఘన చేసిన ఆరోపణలు ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చి బహిరంగ చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి అత్యంత సున్నితమైన వ్యక్తిగత సంక్షోభం ఎదురైనప్పుడు.. పరువు ప్రతిష్టలు ఉన్న కుటుంబాలు బాధితులతో చడీచప్పుడు కాకుండా సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని గుట్టుగా వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకోవడం సహజం. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నష్టనివారణ చర్యలు చేపట్టాల్సింది పోయి, ఆస్తిపాస్తులు, నగదు లావాదేవీలు, ఎదురు ఆరోపణల పేరిట రచ్చను మరింత పెద్దది చేసుకుంటూ కూర్చోవడం చూస్తుంటే కాలికి బురద అంటితే కడుక్కోవాల్సింది పోయి మొహం నిండా రాసుకున్నట్లు ఉందనే కామెంట్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి. దాది కిందట జోగి రమేష్ తన కుమారుడు రాజీవ్ కు సూర్యాపేటకు చెందిన మేఘనతో వివాహం చేయించారు. అయితే ఏడాది పాటు తనను కుటుంబ సభ్యులు ఇబ్బంది పెట్టారని మేఘన ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. పోలీసులు గృహహింస కింద కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల ఇరు కుటుంబాలు కొంతమంది పెద్దలతో కలిసి సమావేశమైనట్లు తెలుస్తోంది. అయితే జోగి రాజీవ్ తన తల్లిదండ్రులను తప్పుపడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. తరుణ్ వైట్ వాష్ చేసి పెళ్లికి ఒప్పించారని ఆయన చెబుతుండగా.. మరోవైపు మేఘన తనకు ఏడాది పాటు నరకం చూపించారని.. చంపేందుకు ప్రయత్నించారంటూ ఆరోపించారు. అయితే ఇరు కుటుంబాల వారు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఎవరు తీసారో తెలియదు కానీ ఈ వీడియోలు మీడియాకు అందాయి. దీంతో సోషల్ మీడియా కూడా కూస్తుండగా.. ప్రధాన మీడియాలో సైతం కథనాలు వస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పని చేశారు జోగి రమేష్. రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ప్రత్యర్థులపై వ్యక్తిగతంగా విమర్శలు చేసేవారు. ఇప్పుడు ఆయన కుటుంబ వ్యవహారం బయటకు రావడంతో పెద్ద ట్రోలింగ్ అవుతోంది సోషల్ మీడియాలో.. అయితే కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో ఇదంతా రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్. అయితే ఇప్పుడు నేరుగా వారి మధ్య జరిగిన పంచాయితీ బయటకు రావడం.. అటు కుమారుడు సైతం తిరగబడటం? కోడలు తరుపు కుటుంబ సభ్యులు సైతం కార్నర్ చేస్తుండడంతో జోగి రమేష్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయితే గతంలో ఆయనతో పాటు కుమారుడు చేసిన వ్యాఖ్యలను జోడిస్తూ.. కర్మ రిటర్న్ అంటూ ఎక్కువ మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో చక్రం తిప్పి, ప్రత్యర్థుల ఇళ్లపైకి దండయాత్రలు చేసిన డాంబికాలు ఇప్పుడు సొంత ఇంటి సమస్యను పరిష్కరించుకోలేని నిస్సహాయత ముందు తేలిపోయాయి. కోడలి కుటుంబం చేస్తున్న ఆరోపణలు, పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కడం, ప్రెస్ మీట్లలో పరస్పర నిందారోపణలు చేసుకోవడం వల్ల జోగి కుటుంబ పరువు బజారున పడటం తప్ప పైసా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారం ఉన్నప్పుడు చూపిన తెగింపు, రాజీకొచ్చే విషయంలో వివేకంగా మారకపోవడమే ఈ వ్యవహారాన్ని మరింత నవ్వులపాలు చేస్తోందిరాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే విమర్శల కంటే.. సొంత చేజేతులా రోడ్డున పడేసుకున్న పరువు వల్ల వెనుక నవ్వుకునే నవ్వులే ఎక్కువ చేటు తెస్తాయి. పోవాల్సిన పరువు ఇప్పటికే పోయింది, మిగిలిన కాస్త ఇజ్జత్ అయినా కాపాడుకోకపోతే ఈ'ఫ్యామిలీ డ్రామా ఎపిసోడ్లు మరింత నాని ప్రజల్లో జోగి ఫ్యామిలీని ఒక కమెడియన్ గ్రూప్‌గా మిగిల్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మీడియా కెమెరాల ముందు డ్రామాలు ఆపి, నలుగురిలో నవ్వులపాలు కాకుండా చాపకింద నీరులా ఈ వివాదానికి తెరదించకపోతే? జోగి వెనుక సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటూ నవ్వుకోవడం ఖాయం.

# బలపడుతున్న అనుమానాలు...
# పవన్ గైర్హాజరుపై సోషల్ మీడియా



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశం, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం , రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. కూటమిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం ప్రారంభించిందిఅగ్రనాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతున్నప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతిపరుల మధ్య వివాదాలు ముదురుతుండటం ప్రతికూల అంశంగా మారింది. స్థానిక నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, పనుల కేటాయింపులు, పోస్టింగ్స్ విషయంలో టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య అసంతృప్తులు కనిపిస్తున్నాయి. ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పోస్టులు పెట్టుకోవడం ప్రత్యర్థులకు మంచి ఆయుధంగా మారుతోంది. అయితే ఈ సోషల్ మీడియా రచ్చను అరికట్టేందుకు ఇప్పటికే ఇరు పార్టీల అధినాయకత్వాలు హెచ్చరికలు జారీ చేస్తూ పరిస్థితిని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాయి. వైసీపీ శ్రేణులు కూటమి దెబ్బతిందని ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజల్లో గానీ, ఓటర్లలో గానీ ఈ కథనాలపై విశ్వసనీయత కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన భారీ విజయం కూటమి పునాది ఎంత బలంగా ఉందో స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, అమరావతి పునర్నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక అంశాల్లో చంద్రబాబు-పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకే మాటపై నడుస్తున్నారు. కాబట్టి కొన్ని చిన్న చిన్న గైర్హాజరులు , సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కూటమి బంధం బలహీనపడిందని వారు ఆనందపడే ప్రయత్నం చేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి అసలైన సవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం అవసరం. గ్రామ స్థాయిలో స్థానాల సర్దుబాటు, నామినేషన్ల ఖరారు విషయంలో ఇరు పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవడమే అధినేతలకున్న పెద్ద టాస్క్. కింది స్థాయి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తెచ్చి పోటీకి దించగలిగితే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చు. పవన్ కల్యాణ్ గైర్హాజరుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడాలంటే ఇరు పార్టీలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది.

# భోగాపురంలో బాదుడే...బాదుడు

**విజయనగరం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులు నడిచినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయం సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దించేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు



చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో విపరీతంగా ట్రోల్ అవుతోంది. వాస్తవానికి విమానాశ్రయం డిస్ప్లే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్ప్లేలో సైతం భారీగా చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపాయలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాధికారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

# ఎలన్ మస్క్ రోజు సంపద రూ.8,300 కోట్లు...



టెక్ దిగ్గజం, టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్ సంపాదనలో కొత్త రికార్డులను నమోదు చేస్తున్నారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య కాలంలో ఆయన రోజుకు సగటున రూ.8,300 కోట్ల (875 మిలియన్ డాలర్లు)కు పైగా సంపాదించినట్లు 'బెస్ట్ బ్రోకర్స్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ ఏడాది కాలంలోనే ఆయన వ్యక్తిగత సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 లక్షల కోట్లు) పెరిగింది. ఈ క్రమంలోనే 2026 జూన్ 12న తన ఆధ్వర్యంలోని స్పేస్ఎక్స్ సంస్థ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టిన వేళ, మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్గా (1 లక్ష కోట్ల డాలర్లు లేదా రూ.95 లక్షల కోట్లకు పైగా సంపద కలిగిన వ్యక్తి) అవతరించారు. అయితే తదుపరి నెలలో స్పేస్ఎక్స్ షేర్లు తీవ్ర క్షీణతకు గురవ్వడంతో ఆయన ఆ హోదాను కోల్పోయినప్పటికీ, అంతర్జాతీయ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఎలాన్ మస్క్ తర్వాత అత్యంత వేగంగా ధనాన్ని ఆర్జించిన పారిశ్రామికవేత్తల్లో డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సిఇఒ మైఖేల్ డెల్ నిలిచారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద 107.6 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. అదేవిధంగా ఎఐ ప్రభంజనంతో చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద 39.5 బిలియన్ డాలర్ల మేర పెరగడంతో ఆయన ప్రపంచంలోని టాప్-50 అత్యంత ధనవంతుల జాబితాలో స్థానం సంపాదించుకున్నారు. మైఖేల్ డెల్, లియాంగ్ వెన్‌ఫెంగ్ తో పాటు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, గియాన్‌కార్లో వంటి ప్రముఖ టెక్ దిగ్గజాలు కూడా ఈ ఎఐ వృద్ధి ద్వారా సంపదను విపరీతంగా పెంచుకున్నారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య కాలంలో ఆయన రోజుకు సగటున రూ.8,300 కోట్ల (875 మిలియన్ డాలర్లు)కు పైగా సంపాదించినట్లు 'బెస్ట్ బ్రోకర్స్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ ఏడాది కాలంలోనే ఆయన వ్యక్తిగత సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 లక్షల కోట్లు) పెరిగింది.

# రష్యా నుంచి రికార్డు స్థాయి చమురు దిగుమతులు



అమెరికా ఆంక్షలు తీవ్రమవుతున్నప్పటికీ రష్యా నుంచి తక్కువ ధరలకు లభించే ముడి చమురును భారత్ భారీగా దిగుమతి చేసుకుం టోంది. నెలలో రష్యన్ క్రూడాయిల్ దిగుమతులు వరుసగా రెండో నెలలోనూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రముఖ స్వచ్ఛంద పరిశోధనా సంస్థ 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సిఆర్ఇఎ)' నివేదిక ప్రకారం.. నెలలో భారతీయ రిఫైనరీలు రష్యా నుంచి ఏకంగా 5.5 బిలియన్ యూరోల (దాదాపు రూ.50,000 కోట్లకు పైగా) విలువైన ముడిచమురును కొనుగోలు చేశాయి.

ఇది జూన్ నెలతో పోలిస్తే పరిమాణం పరంగా 2.1 శాతం అధికం కావడం గమనార్హం. ఈ ఏడాది జులైలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న మొత్తం ఇంధనాల్లో ఒక్క ముడిచమురు వాటానే 87 శాతంగా నమోదైంది. జులైలో రష్యా నుంచి వచ్చిన రోజువారీ సగటు దిగుమతులు 28 లక్షల బారెళ్లకు పెరిగాయి.

ఆ నెలలో భారత్ చేసుకున్న మొత్తం చమురు దిగుమతుల్లో (దాదాపు 50 లక్షల బారెళ్లు) రష్యా వాటా ఏకంగా 55.5 శాతానికి చేరడం విశేషం. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు 2021లో భారత్ రోజుకు కేవలం 1 లక్ష బారెళ్ల లోపు రష్యన్ చమురును మాత్రమే కొనుగోలు చేసేది. 2022 నాటికి ఇది 7.40 లక్షల బారెళ్లకు, 2023లో 18 లక్షల బారెళ్లకు పెరగ్గా, ప్రస్తుతం రికార్డు స్థాయిలో 28 లక్షల బారెళ్లకు చేరింది. దీంతో చైనా తర్వాత రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న రెండో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది.

## త్వరలో యాపిల్ పే సేవలు!




భారత్‌లో డిజిటల్ చెల్లింపుల మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాపిల్ పేను భారత్‌లో ప్రారంభించే అవకాశాలపై కంపెనీ పనిచేస్తోంది. తొలి దశలో కంపెనీ వీసా, మాస్టర్‌కార్డ్ నెట్‌వర్క్‌లలోని ప్రీమియం క్రెడిట్ కార్డ్‌లకు మాత్రమే మద్దతు ఇవ్వనుంది. దీని ద్వారా ఐఫోన్ లేదా ఐప్యాడ్ వినియోగదారులు తమ క్రెడిట్ కార్డ్‌లను యాపిల్ వ్యాలెట్‌కు అనుసంధానించి, షాపుల్లోని స్వైపింగ్ మెషిన్ల (పీఓఎస్) వద్ద ఎన్ఎఫ్‌సీ (ఎన్ఎఫ్‌సీ) టెక్నాలజీతో కాంటాక్ట్‌లెస్ చెల్లింపులు చేయవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), స్పాన్సర్ బ్యాంకుల నుండి ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉన్నందున, ప్రారంభంలో యూపీఐ (యూపీఐ) సేవలు అందుబాటులో ఉండవని సమాచారం. ఈ నేపథ్యంలోనే దేశంలోని ప్రధాన కార్డు జారీ చేసే బ్యాంకులతో యాపిల్ చర్చలు జరుపుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ప్రతి లావాదేవీపై 15?20 బేసిస్ పాయింట్ల ఫీజును యాపిల్ కోరుతున్నట్లు సమాచారం. అయితే కొన్ని బ్యాంకులు దీనిని 10 బేసిస్ పాయింట్లకు పరిమితం చేయాలని చూస్తున్నాయి. ఈ ఫీజును వినియోగదారులు లేదా వ్యాపారులపై నేరుగా వేయకుండా, బ్యాంకులు పొందే ఇంటర్‌ఛేంజ్ ఆదాయం నుంచి చెల్లించే విధానంపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## పసిడిపై కస్టమ్స్ సుంకాల భారీ రాబడి...!



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దిగుమతి సుంకాల సవరణ నిర్ణయం సామాన్య,మధ్యతరగతి వినియోగదారులపై తీవ్ర భారాన్ని మోపింది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచడంతో దాదాపు మూడు నెలల వ్యవధిలోనే పసిడి కొనుగోలుదారుల జేబుల నుంచి కేంద్ర ఖజానాకు ఏకంగా రూ.10,463 కోట్ల అదనపు ఆదాయం వచ్చి చేరింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి కొనుగోళ్లను నిరుత్సాహపరిచి, విదేశీ మారకాన్ని కాపాడాలనే వ్యూహంతో ప్రభుత్వం మే 13న కస్టమ్స్ సుంకాలను సవరించిందన్నారు. బంగారం, వెండిపై అప్పటివరకు 6 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని ఏకంగా 15 శాతానికి పెంచగా, ప్లాటినంపై 6.4 శాతం నుంచి 15.4 శాతానికి పెంచింది. దీంతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా రికార్డు స్థాయికి చేరి, పెళ్లిళ్ల సీజన్‌లో ఆభరణాల కొనుగోలుదారులపై, సామాన్య ప్రజలపై విపరీతమైన ఆర్థిక భారం పడింది.

# ఈపీఎఫ్ఓ అలర్ట్.. నకిలీ లింక్‌లతో జాగ్రత్త

ఆన్‌లైన్‌లో ఈపీఎఫ్ సేవలు ఉపయోగించే చందాదారులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కీలక హెచ్చరిక జారీ చేసింది. ఈపీఎఫ్ఓ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌లు, ఎస్సెమ్మెస్‌లు, ఈ-మెయిళ్లు, సోషల్ మీడియా మెసేజ్‌ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపింది. ఏవైనా అనుమానాస్పద లింక్స్‌ను 'క్లిక్ చేసే ముందు ఆలోచించండి' అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ పోస్టులో చందాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈపీఎఫ్ఓ సేవలను కేవలం అధికారిక వెబ్‌సైట్‌లు, పోర్టల్‌ల ద్వారానే పొందాలని స్పష్టం చేసింది. లాగిన్ చేసే ముందు వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని, అక్షరదోషాలు లేదా అసాధారణ డొమైన్ పేర్లు కనిపిస్తే వెంటనే వాటిని నివారించాలని సూచించింది. ముఖ్యంగా యూఏఎన్, పీపీఓ, ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీల వంటి సున్నితమైన సమాచారాన్ని అధికారిక ఈపీఎఫ్ఓ పోర్టల్‌లు మినహా మరెక్కడా ఇవ్వొద్దని సంస్థ హెచ్చరించింది. ఈపీఎఫ్ఓ ఎప్పుడూ ఫోన్ కాల్, వాట్సాప్, ఎస్సెమ్మెస్, సోషల్ మీడియా లేదా ఈ-మెయిల్ ద్వారా చందాదారుల నుంచి ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు లేదా లాగిన్ వివరాలు అడగదని స్పష్టం చేసింది.




## ర్యాలీలో పెల్లెట్ గన్ కాల్పులు 10 మందికి గాయాలు..!

న్యూఢిల్లీ :ర్యాలీలో పెల్లెట్ గన్ కాల్పుల కారణంగా సుమారు 10 మంది గాయపడినట్లు ఆర్‌టిఐ నివేదిక తెలిపింది. రెండు ఆసుపత్రులు ఇచ్చిన ఈ వివరాలను టిఎంసి ప్రతినిధి సాకేత్ గోఖలే 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించారు. ఢిల్లీలోని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి ఇచ్చిన ఆర్‌టిఐ సమాధానంలో పెల్లెట్ల వల్ల తొమ్మిది మంది గాయపడినట్లు పేర్కొంది. ఈ సమాచారాన్ని ఆసుపత్రి వర్గాలు కూడా ధ్రువీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి తన సమాధానంలో ఒక వ్యక్తి పెల్లెట్ గాయాలతో చికిత్స పొందినట్లు తెలిపింది. జులై 20న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన సందర్భంగా పెల్లెట్ గన్‌లను ఉపయోగించినట్లు మొదట ఢిల్లీ పోలీసులు ఖండించారు. అయితే జులై 22న పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన జనరల్ డైరీ ఎంట్రీలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) అల్లర్ల నియంత్రణ తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు నమోదైనట్లు సమాచారం. పెల్లెట్ గాయాలైన వారిలో 25 ఏళ్ల కళాకారుడు ప్రశాంత్ కుమార్ సింగ్, 25 ఏళ్ల షేక్ ఇర్షాద్ మన్సూరీ, 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచబ్, ఒక పాత్రికేయుడు ఉన్నారు. మరోవైపు 32 ఏళ్ల నూతన్ అనే మహిళ 'మొద్దుబారిన ఆయుధం'తో గాయపడినట్లు వైద్య నివేదికలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు జరిగిన నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాల సంఖ్య ఐదుగా వార్తలు వచ్చాయని సాకేత్ గోఖలే తెలిపారు. అయితే ఆసుపత్రుల నుంచి సేకరించిన రికార్డుల ప్రకారం నిర్ధారిత సంఖ్య సుమారు 10 మందికి చేరిందని ఆయన పేర్కొన్నారు. ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రుల నుంచి మరిన్ని వివరాల కోసం తాను ఇంకా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# అవి దేశద్రోహ డిమాండ్లా?

సిరా చల్లడం క్షణంలో జరిగిపోయే పని. ముఖం నల్లబడుతుంది, బట్టలకు మరక పడుతుంది. కొద్దిసేపటి తర్వాత ఆ మరకను కడిగేయవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఒకరి ముఖంపై పడిన సిరా వెనుక ఉన్న ప్రశ్నను మాత్రం అంత సుల భంగా తుడిచేయలేం. జార్ఖండ్‌లో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాపై జరిగిన సిరా దాడి అలాంటి ఘటనే. ఇది ఒక విద్యార్థి నాయకురాలిని అవమానించడం మాత్రమే కాదు. నిరసన తెలిపే హక్కును, రాజ్యాంగాన్ని కూడా. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీక్‌ల ఆరోపణలపై ఎస్ఎఫ్ఐ, ఐఐఎస్ఏఫ్ లాంటి వామపక్ష విద్యార్థి సంఘాలతో కొద్దిరోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలని, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ప్రయివేటు ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించకూడదని, నియామకాల్లో పారదర్శకత ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నేహా బోరా రాంచీలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకున్న సమయంలో గుంపులో నుంచి అరెస్సెస్ మద్దతుదారునిగా అనుమానిస్తున్న ఓవ్యక్తి నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకు రాళ్లపై సిరా చల్లాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా 'నేహా దేశద్రోహి. ఉమర్ ఖలీద్‌కు మద్దతిస్తోంది' అని తెలిపాడు. ఉమర్ ఖలీద్ పీహెచ్‌డీ విద్యార్థి, జేఎన్‌యూ నాయకుడు. క్యాంపస్‌లో జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో దేశద్రోహ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయన మొదటిసారి వార్తల్లోకి వచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నారు. 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు వెనుక కుట్ర పన్నారని ఆరోపిస్తూ, ఢిల్లీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ఉపా కింద జైల్లో నిర్బంధించారు. ఆయన పాకిస్థాన్ ఏజెంట్ కాదు, దేశద్రోహి అంతకన్నా కాదు. ఎవరైనా నేహా రాజకీయ భావజాలాన్ని వ్యతిరేకించవచ్చు, ఆమె డిమాండ్లతో విభేదించవచ్చు, ఆమెను విమర్శించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయ సమాధానం వాదన కావాలి, దాడి కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. పరీక్షల్లో పారదర్శకత కోరడం దేశద్రోహం కాదు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థుల పక్షాన నిలబడటం దేశద్రోహం కాదు. దేశం అంటే ప్రభుత్వం మాత్రమే కాదు. దేశం అంటే ప్రజలు. దేశం అంటే విద్యార్థులు. దేశం అంటే యువత భవిష్యత్తు.నేహా బోరా గతంలోనూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి 23 రోజుల నిరవధిక నిరాహార దీక్షలోనూ ఉన్నారు. విద్యార్థి సమస్యలు, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆమె చురుకుగా పనిచేస్తున్నారు.సిరా దాడి తర్వాత కూడా భయపడబోనని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

అయితే అసలు సమస్య మాత్రం విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడమే. పరీక్షల్లో నిజంగా అవకతవ కలు జరిగితే చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిజం కాకపోతే ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలతో విద్యార్థులకు సమాధానం చెప్పాలి. పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించాలి. నియామకాల్లో పారదర్శకతను నిర్ధారించాలి. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రశ్నించడం, నిరసించడం, ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదిం చడం కూడా ప్రజాస్వా మ్యంలో భాగమే. జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలని, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ప్రయి వేటు ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించకూడదని, నియామకాల్లో పారదర్శకత ఉండాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నేహా బోరా రాంచీలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకున్న సమయంలో గుంపులో నుంచి అరెస్సెస్ మద్దతుదారునిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకు రాళ్లపై సిరా చల్లాడు.

## ట్రంప్‌కు 'ట్రూత్' కష్టాలు.. రూ.2వేల కోట్ల నష్టం!



అమెరికాఅధ్యక్షుడు ట్రంప్‌నకు సంబంధించిన సోషల్ మీడియా ట్రూత్ భారీ నష్టాన్ని చవిచూసింది. ట్రూత్ సోషల్ మాతృ సంస్థ 'ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్' (ఁఓఉ)నకు రెండో త్రైమాసికంలో 238 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2 వేల కోట్లు) నష్టం వాటిల్లింది. కంపెనీ ఫైలింగ్ ప్రకారం.. జూన్‌తో ముగిసిన ఈ త్రైమాసిక నష్టం.. గత ఏడాది నమోదైన నష్టం కంటే 10రెట్లు ఎక్కువ. సంస్థ ఆదాయం ఏడాది క్రితంతో పోలిస్తే రెట్టింపు కంటే ఎక్కువైనప్పటికీ.. నష్టం మాత్రం తప్పలేదు. డిజిటల్ కరెన్సీ మార్కెట్‌లో భారీ పతనం.. క్రిప్టో కరెన్సీ విలువలు పడిపోవడం వల్లే ఈ నష్టం సంభవించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈనష్టం నేపథ్యంలో భవిష్యత్తులో కొత్త వృద్ధి అవకాశాలను, వాటాదారుల విలువను పెంచే నూతన విధానాలపై దృష్టిపెట్టామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెవిన్ మెక్‌గర్న్ వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, క్రిప్టో వంటి కార్యక్రమాలను పక్కన పెట్టేసి మళ్లీ తమ దృష్టిని సోషల్ మీడియా వ్యాపారాలపై మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.ట్రూత్ మీడియాలో కొత్త ఫీచర్లు తీసుకురావడానికి.. మరింత మంది వినియోగదారులకు దీనిని అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ట్రూత్ సోషల్‌లోని ప్రముఖ వినియోగదారుల పోస్టులను ముందుగానే చూడగలిగేలా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థలకు ముందస్తు యాక్సెస్ ఇచ్చే ట్రూత్ ఏపీఐకు ఇకపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలనిసంస్థ నిర్ణయించుకుంది. ఇందులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోస్ట్‌లను కూడా మిగిలిన వారికంటే ముందే చూసేలా యాక్సెస్ ఉంటుంది. అమెరికా ప్రభుత్వం తీసుకునే ప్రధాన నిర్ణయాలు, మార్పులు తరచుగా మార్కెట్లను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో.. ట్రేడింగ్ సంస్థలు దీనికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి.

## జాగ్రత్తగా ట్యాబ్లెట్లను బటానీల్లా తినేస్తున్నారా...?



తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ వంటి సాధారణ సమస్యలకు డాక్టర్ సలహా లేకుండా మందులు వాడటం ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వీయ వైద్యం వల్ల లక్షణాలు తాత్కాలికంగా తగ్గినా, అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం జరిగి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ, ఒళ్లు నొప్పులు వంటి సాధారణ సమస్యలు వచ్చినప్పుడు చాలా మంది వైద్యుడిని సంప్రదించకుండా స్వయంగా మందులు కొనుగోలు చేసి వాడుతుంటారు. ఈ అలవాటు తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా స్వీయ వైద్యం వల్ల అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం కావడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రతి మందు ఒక నిర్దిష్ట వ్యాధి లేదా పరిస్థితికి అనుగుణంగా వైద్యులు సూచిస్తారు. వ్యాధి కారణాన్ని తెలుసుకోకుండా అదే మందును పదేపదే వాడటం వల్ల లక్షణాలు కొంతవరకు తగ్గినా, అసలు సమస్య మాత్రం అలాగే కొనసాగవచ్చు.

ఫలితంగా వ్యాధి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఆలస్యంగా గుర్తించబడే అవకాశమూ ఉంది. ఇప్పటికే ఇతర అనారోగ్యాలకు మందులు వాడుతున్న వ్యక్తులు వైద్యుల సలహా లేకుండా కొత్త మందులు తీసుకుంటే ఔషధాల మధ్య పరస్పర చర్యలు జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల అలర్జీలు, కాలేయం లేదా మూత్రపిండాలపై ప్రభావం, ఇతర అనుకోని దుష్ప్రభావాలు తలెత్తవచ్చు. అందుకే వైద్యుడిని సంప్రదించే సమయంలో ప్రస్తుతం వాడుతున్న అన్ని మందులు, విటమిన్లు, ఆయుర్వేద లేదా మూలికా ఉత్పత్తుల వివరాలను తెలియజేయడం అవసరం. జలుబు, దగ్గు వంటి సాధారణ సమస్యలకు కూడా చాలామంది యాంటీబయాటిక్స్‌ను స్వయంగా వాడుతుంటారు. అయితే అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం లేదా వైద్యుడు సూచించిన పూర్తి కోర్సును పూర్తి చేయకపోవడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది. దీంతో భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడం కష్టతరమవుతుంది. చిన్నపాటి అసౌకర్యాలకు వెంటనే మందులపై ఆధారపడకుండా ముందుగా విశ్రాంతి, సరైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలి.

అయితే సమస్య పదేపదే వస్తుంటే, తీవ్రంగా ఉంటే లేదా కొన్ని రోజులైనా తగ్గకపోతే తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

## తక్షణ శక్తినిచ్చే ఈ డ్రింక్ ఒక్కసారి ట్రై చేయండి



మనలో ఎంతో మంది విపరీత వేడితో ఇబ్బంది పడతారు. దీనిని క్షణాల్లో తగ్గించుకోవాలంటే ఈ డ్రింక్ తాగితే సరిపోతుంది. ఇది తాగితే, హెల్తీగా ఉంటారు. సత్తు పిండి డ్రింక్ రెసిపీకి కావలసిన పదార్థాలు: నాలుగు టేబుల్ స్పూన్స్ సత్తు పిండి, రెండు గ్లాస్ లు చల్లటి నీరు, రెండు టేబుల్ స్పూన్స్ బెల్లం పొడి, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, పావు టేబుల్ స్పూన్ యాలకుల పొడి, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, రుచికి సరిపడా చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్ క్యూబ్స్ ,తరిగి పెట్టుకున్న పుదీనా ఆకులను తీసుకోవాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : ఒక గిన్నెలో సత్తు పిండిని తీసుకుని, దానిలో కొద్దిగా నీరు పోసి ఉండలు లేకుండా దీనిని మంచిగా కలుపుకోవాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా చల్లటి నీటిని పోస్తూ మిక్స్ చెయ్యాలి. ఇంకా దీనిలో కొద్దిగా ఇప్పుడు బెల్లం కూడా పొడి వేసి మొత్తం కరిగేపోయే వరకు కలపాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 2 : ఒక టేబుల్ స్పూన్ యాలకుల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ఒకటికి రెండు సార్లు బాగా కలపాలి. ఇంకా దీనిలో మీరు కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం కూడా వేసి ఈ టెస్ట్ ను ఎక్కువ పెంచుకోవచ్చు. ఇంకా దీనిలో నాలుగు పుదీనా ఆకులు కూడా వేసి కలిపితే ఫ్రెష్ గా ఉంటుంది. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 3 : ఇంకా ఈ గ్లాస్‌లో నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి సత్తు పిండి డ్రింక్ పోయాలి. దీని పైన అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి చల్లితే రుచి అద్భుతం అని చెప్పాలి. ఇంకా ఇలా తయారు చేసుకున్న తరవాత దీనిని చల్లగా తాగితే అబ్బబ్బా సూపర్ అంటూ తాగుతారు. మీరు దీనిని ఉదయం పూట టిఫిన్ తో పాటు దీనిని తీసుకోవచ్చు ఇంకా స్నాక్ టైమ్‌లో కూడా తాగొచ్చు.

## ఈ సాల్ట్ ఎంత ప్రమాదమో తెలుసా..?



నేటి ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్స్,
జంక్ ఫుడ్స్ తినడం ఒక అలవాటుగా మారిపోయింది. నూడుల్స్, ఫ్రైడ్ రైస్, సూప్స్, మంచూరియా వంటి చైనీస్ వంటకాలకు ఆ ప్రత్యేకమైన కరకరలాడే రుచిని, మంచి సువాసనను అందించడానికి ఒక ప్రత్యేకమైన సాల్ట్‌ను ఉపయోగిస్తారు.

దానినే మనం అజినోమోటో లేదా చైనా ఉప్పు అంటాం. సైంటిఫిక్ భాషలో దీనిని మోనోసోడియం గ్లూటామేట్ (ఓూఉ) అంటారు. అయితే, అజినోమోటో తింటే హార్ట్ ఎటాక్ వస్తుందని, బీపీ పెరుగుతుందని, మెదడు పాడవుతుందనే ప్రచారాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. నాడీ వ్యవస్థ, మెదడుపై ప్రభావం: చైనీస్ వంటకాల్లో వాడే అజినోమోటో మానవ నాడీ వ్యవస్థను (ఔవతీలనీబీబ ూఎబబివఎ) తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇందులోని గ్లుటామిక్ యాసిడ్ మెదడులో సమాచారాన్ని చేరవేసే న్యూరోట్రాన్స్‌మిటర్‌గా పనిచేస్తుంది. మనం తింటున్న ఆహారం ద్వారా ఈ యాసిడ్ శరీరంలో విపరీతంగా ఎక్కువైతే, అది మెదడు పనితీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విపరీతమైన ఆకలి, ఊబకాయం:

అజినోమోటోకు ఒక ప్రత్యేకమైన గుణం ఉంది. ఇది నాలుకపై ఉండే రుచి గ్రంథులను ఉత్తేజపరచడమే కాకుండా, మన ఆకలిని విపరీతంగా పెంచుతుంది. దీనివల్ల కడుపు నిండినప్పటికీ మళ్లీ మళ్లీ తినాలనే కోరిక కలుగుతుంది. ఇలా పదే పదే జంక్ ఫుడ్స్ తినడం వల్ల శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి, వేగంగా బరువు పెరగడం, ఊబకాయం (ూఎవబతిబిఎ) వంటి సమస్యలు వస్తాయి.

## రక్తహీనతను దూరం చేసే సాంప్రదాయ వంటకం



పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉంటారు. పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉంటారు. తెలంగాణ సాంప్రదాయ వంటకం బెల్లం పాశానికి కావలసిన పదార్థాలు : రెండు కప్పుల బియ్యం, కప్పున్నర బెల్లం తురుము , ఒక కప్పుల పాలను తీసుకోవాలి, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి, ఒక టీ స్పూన్ యాలకుల పొడి, 5 జీడిపప్పు, 5 కిస్మిస్ లు రెడీ చేసి పెట్టుకోవాలి. మీ వీటిని వేరు వేరుగా తీసుకోవాలి. దీని కోసం ఎక్కువ టైం పెట్టాల్సిన అవసరం లేదు కొద్దీ నిముషాల్లోనే అవుతుంది. ముందుగా బియ్యాన్ని బాగా ఉడికించాలి : ముందుగా రెండు కప్పుల బియ్యాన్ని తీసుకుని నీటితో కడిగి బాగా ఉడికించాలి. అయితే, మరి మెత్తగా కాకుండా వీటిని బాగా ఉడికించుకోవాలి.

## టాలీవుడ్‌లో సాక్షి మడోల్కర్ జోరు.....




మోగ్లీ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి సాక్షి మడోల్కర్, టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకుంటూ దూసుకుపోతున్నారు. ఇప్పటికే శ్రీవిష్ణు, రామ్ అబ్బరాజు కాంబోలో రాబోతున్న చిత్రంలో ఛాన్స్ కొట్టేసిన ఈ బ్యూటీ, తాజాగా మరో క్రేజీ ఆఫర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యారు. సాక్షి మడోల్కర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రత్యేక పోస్టర్‌ను షేర్ చేస్తూ ఈ కన్ఫర్మేషన్ ఇచ్చారు. అనిల్ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 42గా సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు ఘనంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. సిద్ధు సరసన నటిస్తుండటంతో సాక్షి కెరీర్‌కు ఈ ప్రాజెక్ట్ ప్లస్ కానుందని నెట్టింట చర్చ సాగుతోంది.

## నేను నా హద్దులను ఎప్పటికీ దాటను!

కోలీవుడ్ యంగ్ బ్యూటీ దర్శా గుప్తా బుల్లితెర సీరియల్స్ ద్వారా నటిగా ఎంట్రీ ఇచ్చి, తన నటనతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత సినిమాలపై ఉన్న ఆసక్తితో 'రుద్ర తాండవం' అనే యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, ఓమై గోస్ట్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం యోగిబాబె సరసన 'మెడికల్ మిరాకిల్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ పొలిటికల్ కామెడీ డ్రామా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీ షూటింగ్‌లో ఫుల్ బిజీ అయిపోయాన దర్శా, సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన హాట్ ఫొటోలను షేర్ చేస్తూ నెట్టింట నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఈ క్రమంలోనే ఆమె పోస్ట్ చేసే కొన్ని హాట్ ఫొటోలు వైరల్ కాగా.. హద్దులు మీరుతోందంటూ నెటిజన్ల నుంచి విమర్శలు వచ్చాయి. తాజాగా ఈ విమర్శలపై దర్శా గుప్తా స్పందిస్తూ నెటిజన్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. "నాసోషల్ మీడియాలో ఉన్న అభిమానులు నాకు సొంత కుటుంబం లాంటివారు. వారు నా పుట్టినరోజున లేదా ఇతర ప్రత్యేక రోజుల్లో శుభాకాంక్షలు చెబుతారని, నాతో నేరుగా మాట్లాడతారని అనుకున్నాను. నేను సోషల్ మీడియాలో చేరడానికి ఏకైక కారణం ఇదేనని మురుగన్ స్వామి సాక్షిగా చెబుతున్నాను" అని అన్నారు. అలాగే "ఈ ప్రపంచంలో నావెనుక ఏం జరుగుతుందో నాకు తెలియదు. మాఅమ్మ నేర్పించిన పద్ధతులు, విలువల ప్రకారమే నేను జీవిస్తున్నాను. నేను సెక్సీ ఫొటోలు పోస్ట్ చేయవచ్చు.. కానీ నాకు కొన్ని స్పష్టమైన హద్దులు ఉన్నాయి. ఎంత డబ్బు, కీర్తి వచ్చినా నేను ఆ హద్దులను ఎప్పటికీ దాటను. నన్ను విమర్శించినంత మాత్రాన నేనేమీ బాధపడను" అంటూ దర్శా గుప్తా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## పాన్ ఇండియాగా 'ఇంద్ర పుత్ర'...



ఇటీవలే 'చెన్నై లవ్‌స్టోరీ'తో ప్రేక్షకుల్ని పలకరించారు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమాని ప్రకటించారు. 'ఇంద్రపుత్ర: ఫస్ట్ చాప్టర్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ.. "మన పురాణాల్లో ధర్మానికి.. అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటి ట్రెండ్‌కు తగిన మేకింగ్‌తో ఈ సినిమాని నిర్మిస్తున్నాం. దీనితో మేము ఓ సరికొత్త సినిమాటిక్ వరల్డ్‌ని సృష్టించబోతున్నాం. కిరణ్ ఇందులో ఓ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. భాషలకు అతీతంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా దీన్ని ముస్తాబు చేయనున్నాం. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్టోబరు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది" అన్నారు.

## ఆకట్టుకుంటున్న 'ఐయామ్ గేమ్' ఫస్ట్ సింగిల్



మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త స్టైలిష్ యాక్షన్ స్పోర్ట్స్ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్, మైస్కిన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ స్వరాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 20న ఓణం పండుగ సందర్భంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక సినిమా విడుదల టైమ్ దగ్గర పడటంతో.. తాజాగా మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. ఇందులోని మొదటి పాట 'ఎవరే నువ్వే నాకేమవుతావే'ను విడుదల చేశారు. ఈ పాటలో దుల్కర్ సల్మాన్, కాయదు లోహర్ మధ్య చూపించిన అనురాగం, వారి సైగలు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. "ప్రతి కాలంలోనూ ఆ రంగులంటే చాలా ఇష్టం" అనే క్యాప్షన్‌ను జత చేసి ఈ పాటను వదిలారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1,
Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com